ఈనాడు
పశ్చిమగోదావరి
గురువారం అక్టోబరు 24, 2024

విత్తులోనే.. విపత్తు!

● నాణ్యత లేని రొయ్య సీడ్‌తో నష్టాలు ● పుట్టగొడుగుల్లా అనధికార హేచరీలు



☛ ఉండి మండలం యండగండికి చెందిన సుబ్బరాజు 20 ఎకరాల్లో సాగు ప్రారంభించగా కొద్ది రోజులకే రొయ్యలకు వైట్‌గట్ వ్యాధి సోకింది. దీని వల్ల మేత వినియోగం, సాగు వ్యయం భారీగా పెరిగింది. పట్టుబడి చేశాక ఎకరానికి రూ.లక్ష చొప్పున నష్టం లెక్క తేలింది.

☛ భీమవరం మండలం లోసరికి చెందిన సత్యనారాయణ చెరువులో రొయ్య పిల్లలు వేసిన 15 రోజులకే మృతి చెందాయి. ఎకరాకు సీడ్ కొనుగోలు, రవాణాకు కలిపి రూ.35 వేలు ఖర్చయింది. నాలుగెకరాలకు రూ.1.40 లక్షల నష్టం వాటిల్లింది.

››› భీమవరం మండలంలో నిర్వహిస్తున్న రొయ్య పిల్లల (సీడ్) చెరువులు ఇవి. నర్సరీలుగా పిలిచే వీటిలో ఎలాంటి సాంకేతిక పరిజ్ఞానం, శుభ్రత ఉండవు. ఇవన్నీ ఎలాంటి అనుమతి లేకుండా అక్రమంగా నిర్వహిస్తున్నవే. జిల్లాలో అనుమతి ఉన్న హేచరీలు రెండే ఉన్నాయి. అవి ఒక శాతం అవసరాల్ని మాత్రమే తీరుస్తాయి. ఇక్కడి రైతులు తూర్పుగోదావరి, విశాఖపట్నం, ఒంగోలు, నెల్లూరు, పాండిచ్చేరి ప్రాంతాల నుంచి సీడ్ దిగుమతి చేసుకోవాల్సిందే. దీనికి ఎక్కువ వ్యయం అవుతుండటంతో కొందరు రైతులు అనధికార హేచరీలను ఆశ్రయిస్తున్నారు.

భీమవరం అర్బన్, న్యూస్‌టుడే: డాలర్ల పంటగా గుర్తింపు పొందిన రొయ్యల సాగులో సీడ్ ఎంపికే కీలకం. నాణ్యమైన రొయ్య పిల్లలను వేస్తే వ్యాధులను తట్టుకుని నిలబడి మంచి దిగుబడి వస్తుంది. కానీ నాణ్యమైన సీడ్ అందుబాటులో లేక సాగుదారులు తీవ్రంగా నష్టపోతున్నారు. రొయ్య పిల్లలను ఉత్పత్తి చేసే హేచరీలపై ప్రభుత్వ పర్యవేక్షణ లేకపోవడమే దీనికి ప్రధాన కారణం. పెద్ద హేచరీల్లో అమ్ముడుపోని పిల్ల రొయ్యల్ని కొందరు దళారులు తక్కువ ధరకు కొని తీసుకొచ్చి స్థానికంగా ఉన్న చిన్న చెరువుల్లో మరో పది రోజులు పెంచి స్థానిక రైతులకు విక్రయిస్తున్నారు. అక్రమంగా నిర్వహిస్తున్న ఇలాంటి కేంద్రాల్లో కొనుగోలు చేసిన పిల్ల రొయ్యల ద్వారా వ్యాధులు వ్యాపించి చుట్టుపక్కల చెరువులన్నీ తుడుచుపెట్టుకుపోతున్నాయి.

ఉమ్మడి జిల్లాలో ఇలా

రొయ్యల సాగు విస్తీర్ణం 1.25 లక్షల ఎకరాలు

వార్షిక టర్నోవర్ రూ.18వేల కోట్లు (సుమారు)

తరచూ తనిఖీలు.. హేచరీల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాల్సిందే. ప్రభుత్వ పరంగా తరచూ తనిఖీలు జరుగుతున్నాయి. నర్సరీల్లో రొయ్య పిల్లల పెంపకం, స్థానికంగా సీడ్ ఉత్పత్తి చేయకూడదు. అలాంటివి మా దృష్టికొస్తే కచ్చితంగా చర్యలు తీసుకుంటాం. – ప్రసాద్, జిల్లా ఇన్‌ఛార్జి మత్స్య అభివృద్ధి అధికారి

రైల్వే ప్రయాణికులకు సహాయ కేంద్రం

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: దానా తుపాను నేపథ్యంలో రైల్వే ప్రయాణికుల సౌకర్యార్థం విజయవాడ డివిజన్‌లోని వివిధ రైల్వేస్టేషన్లలో సహాయ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఏలూరు రైల్వేస్టేషన్‌లో 75693 05268, భీమవరంలో 78159 09402 నంబర్లతో సహాయ కేంద్రాలు అందుబాటులో ఉంటాయని, రైల్వే ప్రయాణికులు వాటిని సంప్రదించాలని బుధవారం ఒక ప్రకటనలో కోరారు.

5 నుంచి ఉల్లాస్

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో జిల్లాలో నవంబరు 5 నుంచి ఉల్లాస్ కార్యక్రమం ప్రారంభమవుతుందని వయోజన విద్య ఉప సంచాలకుడు జీసీహెచ్ ప్రభాకర్ తెలిపారు. అక్షరాస్యత కార్యక్రమాల్లో జిల్లాలో 3,895 మందిని చేర్పాలని లక్ష్యంగా నిర్దేశించగా ఇప్పటి వరకు 1,165 మంది వివరాలు నమోదు పూర్తయిందన్నారు.

రహదారి మూసివేత

పెనుగొండ, న్యూస్‌టుడే: ఇరగవరం మండలం అయితంపూడి, ఏలేటిపాడు గ్రామాల్లో సీసీ రోడ్డు విస్తరణలో భాగంగా ఈ నెల 25 నుంచి వచ్చే నెల 12వ తేదీ వరకు పెనుగొండ- పెరవలి రహదారిపై రాకపోకలు నిలుపుదల చేస్తున్నట్లు ఆర్‌అండ్‌బీ ఏఈ టీఆర్ ప్రసాద్ తెలిపారు. బుధవారం రాత్రి ఆయన మాట్లాడుతూ పెనుగొండ నుంచి పెరవలి వెళ్లాల్సిన వాహనాలు పెనుగొండ నుంచి సిద్ధాంతం మీదుగా వెళ్లాలని సూచించారు.

భక్త హనుమంత.. తనువు పులకింత

వైభవంగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు

ఆత్రేయపురం, న్యూస్‌టుడే: వేంకటాద్రిరాయుడు హనుమంత వాహనంపై ఊరేగారు. త్రేతాయుగం నాటి శ్రీరాముడిని తలపిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. కోనసీమ తిరుమల వాడపల్లి వెంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో మూడో రోజు బుధవారం అనన్య భక్తుడైన హనుమంత వాహన సేవలో స్వామివారు కోదండరామ అలంకరణలో భక్తులను కటాక్షించారు. కృతయుగంలో నృసింహస్వామిగా, త్రేతాయుగంలో శ్రీరాముడిగా, ద్వాపర యుగంలో శ్రీకృష్ణుడిగా, కలియుగంలో వెంకటేశ్వరుడిగా స్వామి అవతరించారన్న సందేశాన్ని చాటుతూ వాడపల్లి తిరువీధుల్లో హనుమంత వాహనసేవ.. రామ రాజ్య వైభవాన్ని సాక్షాత్కరింపజేసింది. పండితుడు ఖండవిల్లి రాజేశ్వరవరప్రసాదాచార్యులు నేతృత్వంలో ఉదయం అష్టోత్తర శతకలశాభిషేకం, లక్ష తులసి పూజ, నవగ్రహ హోమం జరిగాయి.



లక్ష తులసి పూజ నిర్వహిస్తున్న అర్చకులు



హనుమత్ వాహన సేవ

పేదల కుటుంబాల్లో దీపావళి కాంతులు

ఏడాదికి ఉచితంగా 3 సిలిండర్లు

నేటి నుంచి నమోదుకు అవకాశం

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: పేద కుటుంబాల్లో దీపావళి కాంతులు విరజిమ్మనున్నాయి. ఎన్డీయే కూటమి ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల్లో ఒకటైన ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ పథకాన్ని రానున్న దీపావళి రోజున ప్రారంభించనున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు ఇప్పటికే ప్రకటించారు. ఈ పథకం ద్వారా పేద కుటుంబాల వారికి ఏడాదిలో మూడు సిలిండర్లను ఉచితంగా పంపిణీ చేయనున్నారు. ఇందుకు అర్హులైన వారు ఈనెల 24 నుంచి బుకింగ్ చేసుకునే సదుపాయాన్ని కల్పించారు. ప్రస్తుతం గ్యాస్ సిలిండర్ ధర రూ.836 ఉంది. దూరాన్ని బట్టి రవాణా ఛార్జీలు అదనంగా ఉంటాయి. దీనిలో ప్రస్తుతం ప్రభుత్వం రూ.10.62 రాయితీగా తిరిగి ఖాతాల్లో జమ చేస్తోంది.



ఇదిపోను రూ.826 లను లబ్ధిదారులు చెల్లిస్తున్నారు. ఇకపై ఎన్డీయే ప్రభుత్వం ఏడాదికి 3 సిలిండర్లను ఉచితంగా చెల్లించనుండటంతో ఒక్కో కుటుంబానికి సగటున రూ.2,475 మేర ఆదా కానుంది. గ్యాస్ సిలిండర్‌ను బుక్ చేసుకున్న వారు ముందుగా సొమ్మును చెల్లించిన తర్వాత వారి వ్యక్తిగత ఖాతాల్లో ప్రభుత్వం నగదు బదిలీ విధానం ద్వారా తిరిగి సొమ్ము జమ చేస్తుంది.

మార్గదర్శకాలు రావాల్సి ఉంది

ఏడాదికి ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లను ఇస్తానని ప్రభుత్వం ప్రకటించినా.. మార్గదర్శకాలు ఇంకా జారీ చేయలేదు. ఎలా దరఖాస్తు చేసుకోవాలనే అంశంపై గురువారం స్పష్టత వచ్చే అవకాశం ఉంది' అని జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారిణి సరోజ తెలిపారు.

అర్హులు ఎవరంటే.. ● ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు చెందిన వారు. ● వార్షికాదాయం గ్రామాల్లో.. రూ.2 లక్షలకు, పట్టణాల్లో రూ.3 లక్షలకు మించని వారు. ● బియ్యం కార్డు కలిగి ఉండాలి. ● అర్హులు ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

రేషన్ కార్డులు 5,67,651

గ్యాస్ కనెక్షన్లు 6.26 లక్షలు

జిల్లాలో రేషన్ కార్డుదారులకు లబ్ధి రూ.120.56 కోట్లు



మార్టేరు హైస్కూల్‌లో విద్యార్థులతో మాట్లాడుతున్న నాగరాణి

వ్యవసాయ కోర్సుల ప్రాధాన్యం గుర్తించాలి: కలెక్టర్

మార్టేరు, పోడూరు, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరూ ఇంజినీరింగ్ విద్యపై మక్కువ చూపడం కాదని వ్యవసాయ పరమైన కోర్సుల ప్రాధాన్యతను గుర్తించాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి విద్యార్థులకు సూచించారు. పెనుమంట్ర, పోడూరు మండలాల్లోని నెగ్గిపూడి ఎస్వీజీ, కవిటం జడ్పీ ఉన్నత పాఠశాలలను బుధవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా కొద్దిసేపు విద్యార్థులతో ముచ్చటించారు. అనంతరం మాట్లాడుతూ నేడు అన్నం తింటున్నామంటే అది రైతు గొప్పతనమని చెప్పారు. మట్టితో అనుబంధం పెంచుకోవాలని తద్వారా కష్టం విలువ తెలుస్తుందన్నారు. చదువుతో పాటు క్రీడలకు కొంత సమయం వెచ్చించాలని సూచించారు. పాఠశాలల్లో సౌకర్యాలపై ఆమె ఆరా తీశారు. విద్యార్థుల లక్ష్యాలకు అనుగుణంగా పదో తరగతి తర్వాత ఏ కోర్సులు అభ్యసించాలి, భవిష్యత్తులో ఉపాధి లభించే మార్గాల వంటి అంశాలపై ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఆమె వెంట తహసీల్దార్లు వై.రవికుమార్, సయ్యద్ మౌలానా ఫాజిల్, ఇతర అధికారులు ఉన్నారు.

దీవెన లేదు.. వంచన



☛ విద్యార్థులను అన్యాయం చేసిన వైకాపా సర్కారు
☛ ఫీజులు చెల్లించాలంటూ యాజమాన్యాల ఒత్తిళ్లు
☛ ఉభయ జిల్లాల్లో రూ.168 కోట్ల బకాయిలు

ఈనాడు, ఏలూరు

వైకాపా సర్కారు విద్యార్థులకు అన్యాయం చేసింది. గతేడాది విద్యాదీవెన బకాయిలు చెల్లించకుండా ఎగనామం పెట్టింది. విద్యా సంవత్సరం ముగిసి ఆరు నెలలు గడిచినా తల్లుల ఖాతాల్లో సొమ్ములు జమ కాలేదు. దీంతో కళాశాల యాజమాన్యాలు ఫీజు చెల్లిస్తేనే మార్కుల పత్రాలు ఇస్తామని తెగేసి చెబుతున్నాయి. దీంతో ఉన్నత చదవులకు, ఉద్యోగ నియామకాలకు వెళ్లే విద్యార్థులు అవస్థలు పడుతున్నారు.

● గణపవరానికి చెందిన ఓ విద్యార్థి ఏలూరులోని ఓ ప్రైవేటు కళాశాలలో డిగ్రీ పూర్తి చేశారు. రెండో ఏడాది నాలుగు విడత, మూడో ఏడాదిలో అసలు విద్యా దీవెన సొమ్ము జమకాలేదు. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఎమ్మెస్సీ గణితం చేరేందుకు మార్కుల పత్రాలు అవసరం కాగా కళాశాలకు వెళితే రూ.62 వేలు ఫీజు కట్టాలని చెప్పారు. సొమ్ము లేక ప్రైవేటు ఉద్యోగంలో చేరారు.

● భీమవరానికి చెందిన ఓ విద్యార్థిని పట్టణంలోని ఓ కళాశాలలో బీటెక్ పూర్తి చేశారు. హైదరాబాద్‌లో ఎంటెక్ చేరాలంటే.. కౌన్సెలింగ్‌లో మార్కుల పత్రాలు అవసరం. కళాశాలకు వెళితే.. ఫీజు బకాయిలు రూ.78వేలు ఉన్నాయి. మరో దారి లేక అప్పు చేసి ఫీజు చెల్లించారు. నెలకు దాదాపు రూ.2వేల వరకు వడ్డీ చెల్లిస్తున్నారు.

● ఏలూరు శ్రీరామ్‌నగర్‌కు చెందిన కోమలి నగరంలోని ఓ కళాశాలలో ఇంజినీరింగ్ చదివారు. ఎంఎస్ చేసేందుకు హైదరాబాద్ వెళ్లగా మార్కుల పత్రాలు అడిగారు. రూ.1.3 లక్షల ఫీజు అప్పు చేసి కళాశాలలో చెల్లించి పత్రాలు తీసుకువెళ్లారు.

జిల్లా	ఏలూరు	పశ్చిమ
జమ కావాల్సిన మొత్తం(రూ.కోట్లలో)	59	109
విద్యార్థుల సంఖ్య	32,990	45,789

వైకాపా సర్కారు కళాశాలలో చదివే పేద విద్యార్థులకు ఏడాదికి రూ.50 వేలు ఇచ్చేలా పథకాన్ని రూపొందించారు. నాలుగు విడతలుగా జమ చేసేలా నిర్ణయం తీసుకున్నారు. పథకం ప్రారంభం నుంచి నగదు జమ విధానం సవ్యంగా లేదు. ఏడాదిలో నాలుగు విడతల్లో ఏదో ఒక సారైనా కొర్రీలు సహజమే. ఉభయ జిల్లాలో 2020-21 విద్యా సంవత్సరంలో మొదటి విడత జమకాని వారు వేలల్లో ఉన్నారు. 2022-23లో చాలా మందికి పడలేదు. 2023-24లో అసలు నిధులు విడుదల చేయలేదు. రెండు జిల్లాలో 78,776 మందికి రూ.168 కోట్ల బకాయిలు ఉన్నాయి.

మార్కుల పత్రాలకు ఒత్తిడి.. ఈ ఏడాది వేలాది మంది విద్యార్థులు కళాశాల నుంచి బయటి వచ్చారు. పీజీ..ఎంటెక్, ఎంఎస్ చేసేందుకు వెళ్లాలంటే మార్కుల పత్రాలు తప్పని సరి. దీంతో కళాశాలల యజమాన్యాలు ఫీజు చెల్లిస్తేనే మార్కుల పత్రాలు ఇస్తామని చేతులెత్తేశారు. ఒక్కో విద్యార్థి రూ.లక్ష నుంచి రూ.1.5 లక్షల వరకు చెల్లించాల్సి ఉంది. దీంతో పేద మధ్య తరగతి విద్యార్థులకు నగదు చెల్లించలేక..ఉన్నత చదువులకు వెళ్లలేక నలిగిపోతున్నారు. కొందరు అప్పులు తెచ్చి మార్కుల పత్రాలు తెచ్చుకుంటున్నారు.

కూటమిపై కోటి ఆశలు.. బకాయిలు చెల్లిస్తామని తాజాగా మంత్రి లోకేశ్ భరోసా ఇచ్చినా నగదు జమ కాలేదు. విద్యార్థులను ఒత్తిడి చేయకుండా మార్కుల పత్రాలు ఇవ్వాలని, ప్రభుత్వం బకాయిలు చెల్లిస్తుందని యాజమాన్యాలకు ప్రభుత్వం చెప్పాలని విద్యార్థులు వాపోతున్నారు. కొద్ది రోజుల్లో జరగనున్న మంత్రివర్గ సమావేశాల్లో దీనిపై కీలక నిర్ణయం తీసుకుంటారని త్వరలో నిధులు జమవుతాయని ఏలూరు, పశ్చిమ జిల్లాల సాంఘిక సంక్షేమశాఖ అధికారులు జయప్రకాశ్, శోభారాణి తెలిపారు

డిసెంబరు 14న జాతీయ లోక్ అదాలత్



న్యాయమూర్తి విజయదుర్గ

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు డిసెంబరు 14న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తామని భీమవరం మూడో అదనపు జిల్లా జడ్జి, సంస్థ ఛైర్‌పర్సన్‌గా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న నరసాపురం పదో అదనపు జిల్లా జడ్జి పి.విజయదుర్గ తెలిపారు. సివిల్, రాజీ పడదగిన క్రిమినల్, వాహన ప్రమాద కేసులు, భార్యాభర్తల తగాదాలు, చిట్‌ఫండ్, చెక్ బౌన్స్, మనోవర్తి, గృహహింస, బ్యాంకు, బీఎస్ఎన్ బకాయిలు తదితర కేసులను లోక్ అదాలత్‌లో రాజీ చేసుకోవచ్చన్నారు. లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకొనేలా న్యాయవాదులు, పోలీసులు అవగాహన కల్పించాలని సూచించారు.

ఉద్యోగ భర్తీ ప్రకటన రద్దు

ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లాలోని వివిధ న్యాయస్థానాల్లో స్పెషల్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ సెకండ్ క్లాస్ ఉద్యోగాల భర్తీకి జారీ ప్రకటనను రద్దు చేసినట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి పురుషోత్తం కుమార్ తెలిపారు. హైకోర్టు ఉత్తర్వులు అనుసరించి రద్దు చేశామని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

వెలిగించాలంటే రూ.6.50 కోట్లు అవసరం

వీధి దీపాల నిర్వహణ గాలికి!

అంధకారంలో పట్టణాలు

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లాలోని పలు పట్టణాల్లో వీధి దీపాల నిర్వహణను వైకాపా పట్టించుకోలేదు. గతంలో తెదేపా హయాంలో పట్టణాల్లోని వీధి దీపాల నిర్వహణ బాధ్యతలను ఈఈఎస్ఎల్‌కు అప్పగించింది. ఒప్పందం మేరకు బకాయిలు లేకుండా బిల్లులు చెల్లించడంతో నిర్వహణ సజావుగా సాగింది. వైకాపా అధికారంలోకి వచ్చాక బిల్లులు సకాలంలో చెల్లించకపోవడంతో ఆ సంస్థకు నిర్వహణ భారమైంది. ఒప్పందం దాదాపు ఏడాది కిందటే చాలా పట్టణాల్లో ముగిసింది. అక్కడ నిర్వహణ బాధ్యతలను పురపాలక సంఘాలు స్వీకరించడం మూలిగే నక్కపై తాటిపండు పడినట్టయింది. వీధి దీపాల నిర్వహణ పూర్తిస్థాయిలో ఉండాలని పట్టణాధికారులకు సూచించినట్లు పురపాలక రాజమహేంద్రవరం ప్రాంతీయ సంచాలకుడు నాగ నరసింహారావు చెప్పారు. బల్బులు, సామగ్రికి సాధారణ నిధులు కేటాయించి కొత్తవి బిగించడంతో పాటు పాత వాటికి మరమ్మతులు చేస్తున్నారన్నారు.




భీమవరంలోని ప్రధాన రహదారులపై వీధి దీపాలు వెలగకపోవడంతో చీకట్లు కమ్ముకుంటున్నాయి. గత కొన్ని నెలలుగా కురుస్తున్న వర్షాలకు బల్బులు పాడైపోయి, పరికరాలు జారిపోయి పరిస్థితి దారుణమైంది

రూ.8 కోట్ల బకాయిలు.. ఉమ్మడి జిల్లాలో గతంలో బాధ్యతలు నిర్వహించిన ఈఈఎస్ఎల్‌కు దాదాపు రూ.8 కోట్ల బకాయిలు ఉన్నాయి. ఒప్పందం పూర్తయినా బకాయిలను గత ప్రభుత్వం చెల్లించలేదు. వీధి దీపం, సామగ్రి కొనుగోలు చేసే శక్తి లేకపోవడంతో మరమ్మతులతో కాలం వెళ్లదీస్తున్నారు. వర్షాలకు దాదాపు 3,430 వీధి దీపాలు వెలగడం లేదు. అన్నిచోట్లా వెలుగులు విరజిమ్మాలంటే రూ.6.50 కోట్లు భారం పడుతుందనేది అంచనా.

చీకట్లో అవస్థలు.. ఎనర్జీ ఎఫిషియన్సీ సర్వీసెస్ లిమిటెడ్(ఈఈఎస్ఎల్)తో ఒప్పందం ఉన్నంతకాలం ఎల్ఈడీ దీపాలతో పాటు వాటి పరికరాలను సంబంధిత సంస్థ సమకూర్చుకుంది. ప్రధాన కూడళ్లలో 110 వాట్స్, అంతర్గత వీధుల్లో 60 వాట్స్, 20 వాట్స్ గల దీపాలను ఏర్పాటు చేశారు. బల్బు మరమ్మతులకు గురైతే 48 గంటల వ్యవధిలోనే కొత్తది ఏర్పాటు చేసేవారు. ఏలూరు, భీమవరం, నరసాపురం, జంగారెడ్డిగూడెం పాలకొల్లు పట్టణాల్లోని దాదాపు 14,500 వీధి దీపాల బాధ్యత ఆ సంస్థపై ఉండేది. ప్రధాన వీధుల నుంచి శివారు ప్రాంతాల వరకు వెలుగులుండేవి. ఆ సంస్థ బాధ్యతలు పూర్తయిన తర్వాత పట్టణాల్లో అంధకారం నెలకొంది. ప్రయాణికులు గుంతల దారుల్లో పడి గాయపడటం, చీకట్లో వెళ్లేవారి మెడలోని బంగారు ఆభరణాలు లాక్కెళ్లడం వంటి సంఘటనలు అధికమయ్యాయి.

పొలాల్లోనే చిరుత

తాజాగా మరిన్ని ప్రాంతాల్లో కాలి గుర్తులు



ఎం.నాగులపల్లి వద్ద నిఘా కెమెరా అమర్చుతున్న అటవీశాఖ సిబ్బంది

భీమడోలు, ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: భీమడోలు శివారు, ద్వారకాతిరుమల మండలం ఎం.నాగులపల్లి పరిసర ప్రాంతాల్లో సంచరిస్తూ ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్న చిరుతను బంధించేందుకు అధికారులు చేస్తున్న ప్రయత్నాలన్నీ విఫలమవుతున్నాయి. తాజాగా ద్వారకానగర్ శివారు వీరాంజనేయ దాబా ఎదుటనున్న వ్యవసాయ క్షేత్రంలో బుధవారం చిరుత కాలిగుర్తులు కనిపించాయి. మంగళవారం అంబరుపేట పంచాయతీ వసంతకాలనీ ప్రాంతంలో తిరిగినట్లు భావించగా- ప్రస్తుతం వెనక్కి వచ్చి ఇక్కడి వ్యవసాయ పొలాల్లో ఉండొచ్చని అటవీ శాఖాధికారులు భావిస్తున్నారు. డిప్యూటీ డీఎఫ్‌వో శ్రీదేవి, రేంజర్ దావీదురాజు నాయుడు, కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది చిరుత కదలికలపై నిఘా పెంచేందుకు వివిధ ప్రదేశాల్లో 15 అత్యాధునిక నిఘా కెమెరాలు ఏర్పాటు చేశారు. కొత్తగా మరో మూడు బోనులు పొదల మాటున పెట్టారు. చిరుత తిరుగుతోందని భావిస్తున్న వ్యవసాయ క్షేత్రాల్లో రాత్రివేళ సిబ్బంది ప్రత్యక్ష నిఘాకు మంచెను(మచాన్) నిర్మించారు. రేంజర్ దావీజురాజు నాయుడు మాట్లాడుతూ... వ్యవసాయ క్షేత్రాలకు వెళ్లే రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. చిరుత కదలికలను గమనిస్తున్నామని, దాన్ని పట్టుకునేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే

సైబర్ నేరాలకు ముకుతాడు!



సాంకేతికత.. సామాజిక మాధ్యమాల విస్తృతి నేపథ్యంలో కొన్నాళ్లుగా సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. ఆన్‌లైన్ మోసాలకు పాల్పడుతూ అమాయకుల వద్ద పెద్ద మొత్తంలో నగదు దండుకుంటున్నారు. దీంతో ఈ నేరాలను అరికట్టేందుకు ఎన్డీయే ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. జిల్లాకో సైబర్ పోలీసుస్టేషన్ ఏర్పాటు చేయనున్నట్లు డీజీపీ తిరుమలరావు గతంలో ప్రకటించారు. సైబర్ స్టేషన్ ఏర్పాటుతో సైబర్ బాధితులకు సాంత్వన చేకూరనుంది.

ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో సైబర్ సెల్ కేంద్రాలున్నాయి. ఇక్కడ బాధితుల వివరాలు నమోదు చేసుకుని రాష్ట్రస్థాయిలో సైబర్ పోలీసు స్టేషన్‌కు కేసులు అనుసంధానం చేస్తున్నారు. దర్యాప్తు, వాటి పురోగతి, సొత్తు రికవరీ, నేరస్థులను పట్టుకోవడం, వారి కదలికలు పసిగట్టడం తదితరాలన్నీ రాష్ట్ర స్థాయిలోనే జరుగుతాయి. ఫలితంగా ఇక్కడ వాటన్నింటినీ పరిష్కరించేందుకు వీలుండటం లేదు. కేసుల ఛేదన ఆలస్యమవుతుండటంతో.. నేరస్థులు తప్పించుకుంటున్నారు.

కేసుల నమోదులో జాప్యం.. సైబర్ నేరాలకు సంబంధించి ఆయా పోలీసుస్టేషన్లలో కేసులు నమోదు చేయడం ఆలస్యమవుతోంది. ఇటీవల నూజివీడు పట్టణానికి ఓ వ్యక్తి బ్యాంకు ఖాతాలోని రూ.3.05 లక్షలను సైబర్ నేరగాళ్లు అపహరించారు. బాధితుడు నూజివీడు పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేసేందుకు వెళితే వారు.. పది రోజులపాటు తప్పించుకున్నారు. చివరకు గట్టిగా ప్రశ్నించడంతో కేసు నమోదు చేయక తప్పలేదు. ఇప్పటికీ బాధితుడికి న్యాయం జరగలేదు.

జిల్లాకో పోలీసుస్టేషన్ ఏర్పాటుకు రంగం సిద్ధం

ఇకపై కేసుల నమోదు, దర్యాప్తు వేగవంతం

ఇకపై జిల్లా స్థాయిలోనే.. జిల్లాకో సైబర్ పోలీసు స్టేషన్ రానుండటంతో.. ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో వీటిని ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటి వరకు సైబర్ నేరం జరిగితే ఆయా శాంతిభద్రతల పోలీసుస్టేషన్లలో కేసులు నమోదు చేస్తున్నారు. జిల్లా స్థాయిలోనే పోలీసుస్టేషన్ ప్రత్యేకంగా ఏర్పాటైతే కేసుల నమోదు, దర్యాప్తు ఇక్కడే జరగనున్నాయి. దీంతోపాటు ఓ డీఎస్పీ స్థాయి అధికారిని నియమించి సీఐలు, ఎస్సైలు, సిబ్బంది పూర్తి స్థాయిగా అందుబాటులో ఉంటారు. అవసరమైన సాంకేతిక వ్యవస్థ స్టేషన్‌లో ఉంటుంది. సాఫ్ట్‌వేర్ రంగంలో ప్రత్యేకంగా శిక్షణ తీసుకున్న సిబ్బందిని నియమిస్తారు. తద్వారా దర్యాప్తు వేగవంతం కానుంది.

నాలుగేళ్లలో సైబర్ నేరాలిలా..

2021	2022	2023	2024
28	31	41	43


సత్వర న్యాయం.. 'జిల్లాకో సైబర్ పోలీసుస్టేషన్ ఏర్పాటైతే కేసుల దర్యాప్తు వేగవంతానికి వీలవుతుంది. బాధితులకు సత్వర న్యాయం జరుగుతుంది' అని ఎస్పీ ప్రతాప్ శివకిశోర్ తెలిపారు.

అలా.. పట్టుకుపోతే ఎలాగండీ?

సీఎండీకి అధికారుల ఫిర్యాదు

ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే: భీమవరంలో నూతనంగా విద్యుత్తు ఎస్ఈ కార్యాలయం ఏర్పాటు చేశారు. ఇప్పటివరకు ఉమ్మడి జిల్లా మొత్తానికి ఏలూరు సర్కిల్ నుంచే కార్యకలాపాలు సాగేవి. ప్రస్తుతం భీమవరం కేంద్రంగా ప్రారంభించారు. పశ్చిమ గోదావరి జిల్లాకు ప్రత్యేకంగా విద్యుత్తు విభాగం ఏర్పాటు చేశారు. ఇక్కడ గతంలో సబ్‌డివిజన్ విద్యుత్తు కార్యాలయం నిర్వహించిన భవనాన్ని ఎస్ఈ కార్యాలయానికి కేటాయించారు. ఎస్ఈ, ఈఈ ఛాంబర్లతోపాటు వివిధ విభాగాలకు చెందిన పలువురు డీఈలు, ఏఈలు, ఇతర సిబ్బంది పనిచేయాల్సి ఉంది. మొన్నటివరకు ఏలూరులో ఏడీఈగా పని చేసిన ఓ అధికారి బదిలీల్లో భాగంగా భీమవరం వెళ్తూవెళ్తూ తన ఛాంబరులోని ఏసీని, మరో గదిలోని ఇంకో ఏసీ పట్టుకెళ్లిపోయారు. కుర్చీలు, టేబుళ్లు సైతం వెంట తీసుకెళ్లినట్లు తెలిసింది. ఈ వ్యవహారంపై చర్యలు తీసుకోవాలని ఇక్కడి అధికారులు ఈపీడీసీఎల్ సీఎండీకి ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

పదవీ విరమణ వేళ మీ ఆత్మీయులకు
శుభాకాంక్షలు తెలపండి



జి.ఎస్.టి. 5% అదనం
మీ కుటుంబ సభ్యులు, మీ బంధువులు, మీ ఆఫీస్‌లో సహోద్యోగులు ఎవరైనా రిటైర్ అవుతున్నారా! అయితే వారికి అందించండి అభినందన చందనాలు.
ఆకాంక్షించండి... వారి భావి జీవిత, సుఖమయ ఆనందాలు...
తెలియజేయండి ఈనాడు ద్వారా పదవీ విరమణ శుభాకాంక్షలు.
80080 12494

(c) eenadu

అపార్‌ను వీడని కష్టాలు

ఆధార్ కేంద్రాల చుట్టూ ప్రదక్షిణలు

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: విద్యార్థులను అపార్ కష్టాలు వీడటం లేదు. కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఆటోమేటెడ్ పర్మనెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ(అపార్) గుర్తింపు కార్డు నమోదు ప్రక్రియకు సాంకేతిక ఇబ్బందులు వెంటాడుతున్నాయి. దాంతో నమోదు ప్రక్రియ ఆలస్యమవుతుంది.

ఇకపై విద్యార్థులందరికీ!

ప్రస్తుతం 9, 10, ఇంటర్మీడియట్ విద్యార్థులకు నమోదు చేస్తున్నారు. ఒకటి నుంచి డిగ్రీ వరకు విద్యార్థులందరికీ అపార్ తప్పని సరి చేస్తూ ఉత్తర్వులు వెలువడనుండటంతో ఆ దిశగా అధికారులు కసరత్తు చేపట్టారు. ప్రతి విద్యార్థికి అకడమిక్ బ్యాంక్ ఆఫ్ క్రెడిట్స్(ఏబీసీ)ను కేంద్ర ప్రభుత్వం కేటాయించనుంది. పాఠశాలస్థాయి నుంచి కళాశాల వరకు దేశంలో ఎక్కడైనా ప్రవేశాలు పొందే సమయంలో అపార్ నమోదై ఉంటే ఇతరత్రా పత్రాలు వెంట తీసుకెళ్లాల్సిన అవసరం లేదు.


నమోదు చేయించుకుంటున్న విద్యార్థి

నమోదుకు గడువు ఏమీ లేకపోయినా సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలనే ఆదేశాలతో ఇప్పటికే 9, 10, ఇంటర్మీడియట్ విద్యార్థుల వివరాలను నమోదు చేస్తున్నారు.

28 శాతానికి మించలేదే?

విద్యార్థి పేరు, పుట్టిన తేదీ, ముఖ చిత్రంతో పాటు 12 అంకెల గుర్తింపు సంఖ్య కేటాయిస్తారు. కార్డుపై ఉన్న క్యూఆర్ కోడ్ స్కానింగ్ చేయడంతో విద్యార్థి వివరాలన్నీ తెలుస్తాయి. అయితే చాలామంది విద్యార్థుల పేర్లు పాఠశాల దస్త్రాల్లో రాసినట్టుగా ఆధార్‌లో లేవు. కొందరివి పుట్టిన తేదీలు సరిగ్గా లేవు. సంవత్సరమో, నెలో, పుట్టిన తేదీలో ఏదొక సరిపోలకపోవడంతో అపార్ నమోదుకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. విద్యార్థి పేరు, పుట్టిన తేదీ, లింగం వివరాల్లో మార్పులకు ఎంఈవోల లాగిన్‌కు అవకాశం ఇచ్చామని విద్యాశాఖ అధికారులు చెప్పారు. ఆధార్‌లోని తప్పులను సరిచేసుకునేందుకు మాత్రం ఆధార్ నవీకరణ సద్వినియోగం చేసుకునేందుకు వెళ్తున్న విద్యార్థులతో ఆధార్ నవీకరణ కేంద్రాలు కిటకిటలాడుతున్నాయి.

జిల్లాలో నమోదు ఇలా..
ఉన్నత పాఠశాలల విద్యార్థుల సంఖ్య - 47,856
ఇప్పటి వరకు నమోదైన వారు- 18,855
ఇంటర్మీడియట్ విద్యార్థులు మొత్తం- 36,724
నమోదు పూర్తయిన వారి సంఖ్య 5,664

జిల్లాలో ప్రస్తుతం కొనసాగుతున్న అపార్‌లో 9, 10, ఇంటర్మీడియట్ విద్యార్థుల నమోదు ప్రక్రియ 28 శాతం మించలేదు. ఇంటర్మీడియట్ విద్యార్థుల సమాచారం సరిచేసి అపార్ నమోదు చేయిస్తున్నామని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి నాగేశ్వరరావు చెప్పారు.

అసంపూర్తిగా నిర్మాణం!

పోడూరు మండలం జిన్నూరులో పంట కాలువపై వంతెన అసంపూర్తిగా ఉంది. జలవనరులశాఖ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 2019న రూ.1.23 కోట్ల అంచనా వ్యయంతో వంతెన పనులు చేపట్టారు. అప్రోచ్ రహదారి పనులు నిలిపిపోవడంతో నిరుపయోగంగా ఉంది. పక్కనున్న పాతవంతెనపైనే స్థానికులు రాకపోకలు సాగిస్తున్నారు. జిన్నూరు గ్రామ సచివాలయం ఎదురుగా ఉన్న కల్వర్టు నిర్మాణం అసంపూర్తిగా ఉంది. పాలకొల్లు- మారుటేరు ప్రధాన రహదారి కావడంతో నిత్యం వాహనాలతో రద్దీగా ఉంటోంది. ఏ మాత్రం అదుపు తప్పినా ప్రమాదం పొంచి ఉన్నట్లే. గత వైకాపా అయిదేళ్ల ఏలుబడిలో వీటిని పట్టించుకోలేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు పరిశీలించి పనులు పూర్తిచేయాలని స్థానికులు కోరుతున్నారు. - ఈనాడు, పోడూరు


జిన్నూరులో అప్రోచ్ రహదారులు లేని వంతెన


నిలిచిన కల్వర్టు పనులు

డ్రోన్లతో ప్రయోజనాలెన్నో : జేసీ

భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే: వివిధ రంగాల్లో డ్రోన్ల వినియోగంతో ఎన్నో ప్రయోజనాలు పొందవచ్చని సంయుక్త కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలో జరుగుతున్న డ్రోన్ సదస్సు, ప్రదర్శనలను ఆయన బుధవారం పరిశీలించారు. పలు రకాల డ్రోన్ల పని తీరు గురించి అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో ఆరు డ్రోన్లు అందుబాటులో ఉన్నాయని.. వాటి ద్వారా స్వయం సహాయక సంఘాల మహిళలకు శిక్షణ ఇప్పిస్తున్నట్లు తెలిపారు.

పంచారామాలకు ప్రత్యేకాధికారులు

భీమవరం ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: కార్తికమాసం సందర్భంగా పంచారామ క్షేత్రాల్లో నిర్వహించే కార్యక్రమాల పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులను నియమిస్తున్నట్లు దేవాదాయ శాఖ ప్రాంతీయ సంయుక్త కమిషనర్(ఆర్‌జేసీ) కె.సుబ్బారావు తెలిపారు. భీమవరంలోని సోమేశ్వరాలయానికి బుధవారం వచ్చిన ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఆలయాల్లో దర్శన వరుసలు, మంచినీటి సరఫరా, పారిశుద్ధ్యంపై ప్రత్యేకంగా దృష్టి సారించేలా సంబంధిత అధికారులను ఆదేశించినట్లు పేర్కొన్నారు.


మాట్లాడుతున్న సుబ్బారావు

ఉద్యోగిపై ఫిర్యాదు.. విచారణ.. భీమవరంలోని పంచారామ క్షేత్రం సోమేశ్వరజనార్దన స్వామి ఆలయ ఉద్యోగిపై అందిన ఫిర్యాదు మేరకు ఆశాఖ ప్రాంతీయ సంయుక్త కమిషనర్ కె.సుబ్బారావు బుధవారం విచారణ జరిపారు. ఆలయంలో అమర్ అనే వ్యక్తికి ఏ అర్హతతో ఉద్యోగం ఇచ్చారో తెలియజేయాలని.. అతడిపై పలు ఆరోపణలు ఉన్నాయని మాజీ కౌన్సిలర్ కోడే యుగంధర్ దేవాదాయశాఖ కమిషనర్‌కు ఫిర్యాదు చేయడంతో ఆయన ఆదేశాల మేరకు ఆర్‌జేసీ విచారణ జరిపారు. ఆరోపణలకు సంబంధించిన ఆధారాలు ఇవ్వాలని ఆర్‌జేసీ కోరడంతో ఫిర్యాదుదారుడు వారంరోజుల గడువు కోరారు. దేవస్థానం ఈవో డి.రామకృష్ణంరాజు నుంచి పలు వివరాలను తెలుసుకుని నమోదు చేశారు.

27న హనుమాన్ చాలీసా పారాయణ మహాయజ్ఞం

పెదపుల్లేరు (ఉండి), న్యూస్‌టుడే: ఉండి మండలం పెదపుల్లేరులోని సత్యమ్మ ఆలయ ప్రాంగణంలో ఈ నెల 27న ఉదయం 9 గంటలకు సహస్ర గళ హనుమాన్ చాలీసా పారాయణ మహాయజ్ఞం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. విశ్వ హిందూ పరిషత్ మాతృశక్తి విభాగ్ ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమంలో కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, ఎమ్మెల్యే కనుమూరి రఘురామకృష్ణరాజు, విశ్వ హిందూ పరిషత్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పవిలిశెట్టి వెంకటేశ్వర్లు, తనికెళ్ల సత్య రవికుమార్, ఉపాధ్యక్షుడు ఉద్దరాజు వేణుగోపాలరాజు తదితరులు పాల్గొంటారని పేర్కొన్నారు.

సెపక్‌తక్రా పోటీల్లో ద్వితీయం

శ్రీకాకుళం అర్బన్, న్యూస్‌టుడే: రాష్ట్ర స్థాయి సెపక్‌తక్రా పోటీల్లో సిక్కోలు క్రీడాకారులు సత్తా చాటారు. జిల్లా సెపక్‌తక్రా సంఘం ఆధ్వర్యంలో శ్రీకాకుళం నగరంలో మంగళవారం ప్రారంభమైన 34వ రాష్ట్ర స్థాయి సీనియర్ సెపక్‌తక్రా ఛాంపియన్‌షిప్ పోటీలు బుధవారం విజయవంతంగా ముగిశాయి. మహిళల విభాగంలో శ్రీకాకుళం జట్టు ప్రథమ, పశ్చిమగోదావరి ద్వితీయ, కర్నూలు, ప్రకాశం జట్లు సంయుక్తంగా తృతీయ స్థానం దక్కించుకున్నాయి.



పశ్చిమగోదావరి జిల్లా మహిళా జట్టు

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

ఏలూరు తూర్పువీధి, న్యూస్‌టుడే: స్థానిక ఇండోర్ మైదానంలో పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యాన త్రోబాల్, కబడ్డీ అండర్-14, 17 విభాగాల్లో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా స్థాయి బాలబాలికల ఎంపిక పోటీలు బుధవారం నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా వివిధ పాఠశాలల నుంచి కబడ్డీకి 760, త్రోబాల్‌కు 370 మంది చొప్పున క్రీడాకారులు హాజరయ్యారు. రెండు క్రీడలకూ చెరో 12 మంది చొప్పున ఎంపిక చేశారు. అండర్-17 బాలబాలికల కబడ్డీ జట్లు ఈ నెల 25న విజయనగరంలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటాయని ఎస్‌జీఎఫ్ అండర్-14, 17 విభాగాల కార్యనిర్వహణాధికారి కె.అలివేలు మంగ తెలిపారు. వివిధ పాఠశాలల పీఈటీలు, సిబ్బంది, క్రీడాకారులు పాల్గొన్నారు.


త్రోబాల్ బాలికల జట్టుతో అలివేలు మంగ, పీఈటీలు

15 కిలోల సీతల్ చేప



కలిదిండి, న్యూస్‌టుడే: కలిదిండి మండల కేంద్రంలోని నల్లగోపుల చలపతికి చెందిన చేపల చెరువులో బుధవారం భారీ సీతల్ రకానికి చెందిన చేప లభ్యమైంది. సాధారణంగా 10 కిలోల వరకు పెరిగే ఈ రకం చేప అరుదుగా 15 కిలోల చేప కనిపించడంతో చూసేందుకు పెద్ద ఎత్తున ప్రజలు ఎగబడ్డారు. రోహూ, కట్లా జాతికి చెందిన చెరువుల్లో చైనా గొరకను నివారించేందుకు ఈ సీతల్ రకానికి చెందిన చేపలను చెరువుల్లో తక్కువ స్థాయిలో పెంచుతారు. 8 నెలల వ్యవధిలో 15 కిలోల వరకు పెరిగిందని రైతు తెలిపారు.

అప్రమత్తతతో చోరీల కట్టడి

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: గొలుసు దొంగతనాలు, ఇళ్లలో చోరీల కట్టడికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలను అప్రమత్తం చేసేలా పోలీసు శాఖ ప్రచార కార్యక్రమాలు చేపట్టింది. ఎస్పీ అద్నాన్ నయీం అస్మి ఆదేశాల మేరకు జిల్లాలో పోలీస్‌స్టేషన్ల వారీగా ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఉదయం నడకకు వెళ్లే సమయంలో, ఇళ్లకు తాళాలు వేసి ఇతర ప్రాంతాలకు వెళ్లేవారు, ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరిస్తున్నారు. అపరిచితులు, అనుమానాస్పద వ్యక్తుల విషయంలో అప్రమత్తతతో వ్యవహరించాలంటున్నారు.

సచివాలయ నిర్మాణానికి విరాళం

ముదినేపల్లి, న్యూస్‌టుడే: రాష్ట్ర సచివాలయ నిర్మాణానికి ముదినేపల్లికి చెందిన అమరావతి అంబాసిడర్ అంబుల వైష్ణవి అర ఎకరం పొలాన్ని అమ్మి విరాళంగా అందించారు. మంగళవారం రాత్రి సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును ఆమె తండ్రి వైద్యుడు మనోజ్‌తో కలిసి డబ్బు అందించారు. అర ఎకరానికి సంబంధించిన రూ.12.5 లక్షలు, హైకోర్టు నిర్మాణానికి బంగారపు గొలుసు అమ్మి రూ.లక్ష విరాళం ఇచ్చారు. గతంలో అమరావతి అభివృద్ధికి ఆమె ఎకరం(రూ.25 లక్షలు), పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి కూడా విరాళం అందించారు.


ముఖ్యమంత్రికి విరాళం అందిస్తున్న వైష్ణవి, మనోజ్

గ్లకోమా గుర్తింపుపై పరిశోధనలు

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: గ్లకోమా వ్యాధి కంటి చూపును నిశ్శబ్దంగా కబళించి శాశ్వత అంధత్వానికి గురిచేస్తుందని సీక్యూఐ, రీసెర్చ్ డైరెక్టర్ డాక్టర్ టి.రవీంద్ర తెలిపారు. స్థానిక ఏపీ నిట్ ప్రాంగణంలో బుధవారం గ్లకోమాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృత్రిమ మేధస్సును ఉపయోగించి గ్లకోమాను ముందుగానే ఎలా గుర్తించాలనే అంశంపై పరిశోధన జరుగుతోందన్నారు. ప్రస్తుతం గ్లకోమా అత్యంత ప్రమాదకరంగా మారిందని, దేశంలో చాలా మంది ఈ వ్యాధితో బాధపడుతున్నారని పేర్కొన్నారు. కంటి సమస్యలను ఎవరూ నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ పి.దినేష్ శంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


పాల్గొన్న నిట్ ఆచార్యులు, విద్యార్థులు


దుకాణాల వద్ద రత్నప్రసాద్ తదితరులు

బాలలతో పని చేయిస్తే అనుమతులు రద్దు

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: బాలలతో హోటళ్లు, దుకాణాల్లో పనులు చేయిస్తే అనుమతులు రద్దు చేయిస్తామని, యజమానులపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ హెచ్చరించారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన ప్రత్యేక తనిఖీల్లో భాగంగా కార్మికశాఖ సహాయక కమిషనర్ నాగేశ్వరరావు, డీసీపీవో కె.సూర్యచక్రవేణి, ఏఎల్‌ఎస్ సమన్వయకర్త రాధాకృష్ణతో కలిసి నగరంలోని వివిధ హోటళ్లు, దుకాణాలను బుధవారం తనిఖీ చేశారు. యజమానులు, సిబ్బందికి బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ.. ఎవరైనా బాల కార్మిక వ్యవస్థను ప్రోత్సహిస్తే టోల్‌ఫ్రీ నంబర్లు 1098, 15100కు సమాచారం ఇవ్వాలని కోరారు.

అంతర్జాతీయ స్థాయికి జంగారెడ్డిగూడెం యువకుడి ప్రతిభ

సింగపూర్‌లో నిర్వహించే ఈత పోటీలకు అర్హత

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: జంగారెడ్డిగూడెం పట్టణానికి చెందిన స్విమ్మర్ బుడిగిన రవి కార్తీక్ అంతర్జాతీయ పారా ఈత ఛాంపియన్ షిప్ పోటీలకు అర్హత సాధించాడు. ఈ నెల 19 నుంచి 22 వరకు గోవాలో నిర్వహించిన జాతీయ స్థాయి పోటీల్లో జూనియర్స్ కేటగిరి అండర్-18 విభాగంలో రవి కార్తీక్ 110 మీటర్ల ఫ్రీస్టైల్, 100 మీటర్ల బటర్ ఫ్లై, 100 మీటర్ల బ్రెస్ట్ విభాగాల్లో మొదటి స్థానంలో నిలిచి మూడు బంగారు పతకాలు దక్కించుకోవడంతో పాటు దేశ వ్యాప్తంగా పాల్గొన్న 518 మంది క్రీడాకారుల్లో అత్యంత ప్రతిభ చూపడంతో గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్ ద్వారా ఛాంపియన్‌షిప్‌ను అందుకున్నారు. ఈ విశేష ప్రతిభతో వచ్చే ఏడాది సెప్టెంబరులో సింగపూర్‌లో జరగబోయే అంతర్జాతీయ పారా స్విమింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలకు దేశం తరపున ప్రాతినిధ్యం వహించేందుకు అర్హత సాధించినట్లు పారా కమిటీ ఆఫ్ ఇండియా కమిటీ ప్రకటించింది. రవి కార్తీక్ 2020 నుంచి వరుసగా 5 జాతీయ పారా ఈత పోటీల్లో పాల్గొన్నాడు. ఒక్కో ఏడాది మూడేసి చొప్పున 15 బంగారు పతకాలు సాధించారు. 2023లో ఈజిప్టులో జరిగిన పోటీల్లోనూ రెండు అంతర్జాతీయ పతకాలు దక్కించుకున్నాడు. అతడి తండ్రి బుడిగిన నాగేంద్రకుమార్ న్యాయవాది. తల్లి గృహిణి. రవి కార్తీక్ ప్రస్తుతం డిగ్రీ చదువుతున్నాడు.


గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్ ద్వారా ట్రోఫీ అందుకుంటున్న రవికార్తీక్

ప్రభుత్వ నర్సుల సంఘం ఎన్నికలు ప్రశాంతం

ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే: స్థానిక సర్వజన ఆసుపత్రిలోని సమావేశ మందిరంలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రభుత్వ నర్సుల సంఘం ఎన్నికలు బుధవారం నిర్వహించారు. రాత్రి 10 గంటలకు డివిజనల్ కో-ఆపరేటివ్ అధికారి త్రినాథ్ ఫలితాలు వెల్లడించారు. ఉమ్మడి జిల్లాలో 264 మంది ఓటర్లుండగా- 224 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. అధ్యక్షురాలిగా దండుబోయిన అనూష, ఉపాధ్యక్షురాలిగా మొగపర్తి దయావతమ్మ, కార్యదర్శిగా మార్లపూడి లీలారాణి, కోశాధికారిగా తరగటూరి సామ్రాజ్యం, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా నల్లమెల్లి బేబీ ఉమా, రాయల కన్యాకుమారి, దాసి మాధవి ఎన్నికయ్యారు. ఎన్నికల ఫలితాలు వెల్లడించే సమయంలో కాస్త హడావుడి నెలకొంది. సమాచారం అందుకున్న రెండో పట్టణ పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

ఆలయంలో స్వర్ణాభరణాలు చోరీ

ఇద్దరి అరెస్టు

ఏలూరు నేరవార్తలు న్యూస్‌టుడే: రామాలయంలోకి చొరబడి స్వర్ణాభరణాలు, నగదు కాజేసిన ఘటనలో ఇద్దరిని ఏలూరు ఒకటో పట్టణ పోలీసుల అరెస్టు చేశారు. బుధవారం విలేకరుల సమావేశంలో డీఎస్పీ డి.శ్రావణ్ కుమార్ కేసు వివరాలు వెల్లడించారు. స్థానిక రామకోటి ప్రాంగణంలోని రామాలయంలో ఈ నెల 17న రాత్రి చోరీ చోటుచేసుకుంది. గర్భగుడి తలుపు తాళాలను ఇనుప రాడ్డుతో పగులగొట్టిన దొంగలు లోపలికి చొరబడి సీతమ్మ విగ్రహం నుంచి బంగారు మంగళసూత్రం, చెవి పోగులు, రామయ్య వెండి మొలతాడు, హుండీలోని నగదు... ఇలా మొత్తం 12.640 గ్రాముల స్వర్ణాభరణాలు, 733 గ్రాముల వెండి వస్తువులు, రూ.5 వేల నగదు దోచుకెళ్లారు. దీనిపై కేసు నమోదు చేసిన ఒకటో పట్టణ సీఐ సత్యనారాయణ దర్యాప్తు చేపట్టారు. ఎస్పీ ప్రతాప్ శివకిశోర్ ఆదేశానుసారం డీఎస్పీ శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో సీఐ సత్యనారాయణ ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశారు. స్థానిక గజ్జెలవారి చెరువు రోడ్డులో బుధవారం అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరిని అదుపులోకి తీసుకొని విచారించారు. చోరీకి పాల్పడింది ఏలూరు తూర్పువీధికి చెందిన తిరుమల రామశివ, మరడానిరంగారావు కాలనీకి చెందిన గడ్డి విజయ్‌కుమార్ అలియాస్ నానిగా నిర్ధారించుకొని వారిని అరెస్టు చేశారు. చోరీకి గురైన సొత్తును స్వాధీనం చేసుకున్నారు.


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రావణ్ కుమార్

అక్క అత్తింటివారు తిట్టారని యువతి ఆత్మహత్యాయత్నం

ఏలూరు మహిళా పోలీసుస్టేషన్ వద్ద ఘటన

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: అక్క అత్తింటివారు తిట్టారన్న మనస్తాపంతో ఓ యువతి ఏలూరు మహిళా పోలీసుస్టేషన్ వద్దఉన్న మరుగుదొడ్డిలో ఉరేసుకొని ఆత్మహత్యకు యత్నించారు. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం మేరకు.. వట్లూరు శౌరీపురానికి చెందిన చొదిమెళ్ల శైలజకు పెదవేగి మండలం కవ్వగుంటకు చెందిన రమేశ్‌తో 2017లో వివాహమైంది. నెల రోజుల క్రితం దంపతుల మధ్య గొడవ చోటుచేసుకుంది. భార్య పిల్లలను తీసుకుని శౌరీపురంలోని పుట్టింటికి చేరారు. శైలజ చెల్లి స్వరూప మహిళా పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేద్దామని, బావను మందలించి కాపురం సజావుగా జరిగేలా కౌన్సెలింగ్ ఇస్తారని ధైర్యం చెప్పారు. ఈ క్రమంలో బుధవారం ఏలూరు మహిళా పోలీసు స్టేషన్‌కు చేరుకొని అక్కతో ఫిర్యాదు ఇప్పించారు. దీంతో పోలీసులు శైలజ భర్త, అతని కుటుంబ సభ్యులను స్టేషన్‌కు పిలిపించారు. సమస్యను పెద్దల సమక్షంలో పరిష్కరించుకుంటామని, కొంత సమయం ఇవ్వాలని కోరడంతో పోలీసులు వారిని పంపేశారు. స్టేషన్ బయట స్వరూపను బావ రమేశ్, అతని కుటుంబ సభ్యులు మందలించారు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన యువతి స్టేషన్ ప్రాంగణంలోని మరుగుదొడ్డిలోకి వెళ్లి చున్నీతో ఉరి బిగించుకోగా.. గమనించిన పోలీసులు ఆమెను కిందకు దించి తమ వాహనంలోనే సర్వజన ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్య సేవల నిమిత్తం విజయవాడ తీసుకెళ్లారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బ్రాయిలర్ ధరలు (కృష్ణాజిల్లా) (కిలో 1 కి రూ.లలో)
వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -130 రిటైల్ ధర 152 చికెన్ విత్ స్కిన్ - 220, చికెన్ స్కిన్‌లెస్ - 251.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 131, 140, 151 చికెన్ విత్ స్కిన్ - 250 చికెన్ స్కిన్‌లెస్ - 260.

పర్యాటక వీసాలతో మోసం

నిందితుడి అరెస్టు

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: ఆర్థిక ఇబ్బందులున్న యువకులను లక్ష్యంగా చేసుకుంటాడు.. విదేశాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తానని.. బాగా డబ్బు సంపాదించవచ్చని నమ్మబలుకుతాడు. గల్ఫ్, ఒమన్ తదితర దేశాలకు ఉద్యోగ వీసాకు బదులు పర్యాటక వీసాలు ఇప్పిస్తూ.. అమాయకులను మోసం చేసిన కేసులో ఓ నిందితుడ్ని ఏలూరు ఒకటో పట్టణ పోలీసులు అరెస్ట్ చేశారు. తన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ డి.శ్రావణ్ కుమార్ కేసు వివరాలు వెల్లడించారు. పశ్చిమగోదావరి జిల్లా కాళ్ల మండలం బొండాడ గ్రామానికి చెందిన దుండి జాన్ బాబు, ప్రస్తుతం ఒమన్‌లో ఉంటున్న పాలడుగు ప్రసాద్ అమాయకులను మోసం చేస్తూ... పర్యాటక వీసాపై విదేశాలకు పంపుతున్నారు. ఏలూరు బావిశెట్టివారిపేటకు చెందిన బయలపాటి దుర్గాప్రసాద్ తన భార్య నాగమ్మను పని నిమిత్తం విదేశాలకు పంపాలని జాన్‌బాబును సంప్రదించారు. అతడు పాలడుగు ప్రసాద్‌తో మాట్లాడి.. ఒమన్ దేశం పంపుతామంటూ రూ.30 వేలు వసూలు చేశారు. 2023లో నాగమ్మను పర్యాటక వీసాతో అక్కడికి పంపగా- పోలీసులు అరెస్టు చేశారు. విషయం తెలుసుకున్న బాధితుడు దుర్గాప్రసాద్ అప్పట్లో ఒకటో పట్టణ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా- వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఏలూరు కెనాల్ రోడ్డులో ప్రధాన నిందితుడు దుండి జాన్‌బాబును బుధవారం సీఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో ఎస్సై మదీనా బాషా, హెడ్‌కానిస్టేబుల్ రాధాకృష్ణ, కానిస్టేబుళ్లు యశ్వంత్‌కుమార్, సురేశ్ కుమార్ అరెస్ట్ చేశారు.

జిల్లా మత్స్య సహకార సంఘము లి. నెం. 151/D, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా, ఏలూరు

ఎన్నికల కార్యక్రమ ప్రకటన

[illegible]

తేది: 23-10-2024 సం/- కె.రవి, ఎన్నికల అధికారి

SBI భారతీయ స్టేట్ బ్యాంక్
సీతారామపురం బ్రాంచ్-08496, నరసాపురం, పశ్చిమ గోదావరి జిల్లా-534280

ఋణగ్రహీతకు డిమాండ్ నోటీస్

[illegible]

తేది : 23.10.2024 ప్రదేశం : భీమవరం సం/- అధీకృత అధికారి భారతీయ స్టేట్ బ్యాంక్

కెనరా బ్యాంక్ Canara Bank
ఆకివీడు బ్రాంచ్ (2775)

స్థిరాస్తుల అమ్మకానికి వేలం అమ్మకం ప్రకటన

[illegible]

ఇ-వేలం తేది & సమయం: 27.11.2024, ఉ॥ 10.30 గం.ల నుండి ఉ॥ 11.30 గం.ల వరకు

రిజర్వు ధర: రూ. 40,82,000/- ధరావత్తు సొమ్ము: రూ. 4,08,200/-

www.canarabank.com https://ebkray.in

తేది: 19.10.2024 ప్రదేశం: ఆకివీడు సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

EENADU e Classifieds

BUSINESS SERVICES

REAL ESTATE

PLOT FOR SALE

FACULTY/ TEACHERS

TO LET

COMMERCIAL

Commercial Hospital Building For Rent Near Old Bus Stand Eluru. Ph: 9848112379, 8106799778

JOBS

Wanted MBBS Duty Doctors, Homeopath (BHMS) Doctors, OT Technician and Nursing Staff for Renowned Hospital in Palakollu Contact: 94933 47998.

గమనిక

[illegible]

92.7 FM Rajamahendravaram
ఈఎఫ్‌ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact 9000180626, 6304901226

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

భీమవరం పట్టణం	:80085 74471	వీరవాసరం	:80085 74475
భీమవరం మండలం	:80085 74533	ఉండి	:80085 74526
ఆకివీడు	:80085 74525	పాలకోడేరు	:80085 74467
కాళ్ల	: 80085 74474		

భీమవరం (గ్రామీణ), న్యూస్‌టుడే

సమస్య: భీమవరం మండలంలో కొవ్వాడపుంత నుంచి కొవ్వాడ గ్రామంలోకి వెళ్లే రహదారి గుంతలతో అధ్వానంగా మారింది. రాకపోకలకు ఇబ్బంది పడుతున్నాం.- **స్థానికులు**

సమాధానం: ఉపాధిహామీ పథకంలో ఈ రహదారి అభివృద్ధి చేసేలా ప్రతిపాదన పంపాం.- **శ్యామ్, పంచాయతీ కార్యదర్శి**

నేడు కోళ్లపర్రులో రీ-సర్వే గ్రామ సభ

కోళ్లపర్రు (ఆకివీడు), న్యూస్‌టుడే: కోళ్లపర్రు సచివాలయం వద్ద భూ రీ-సర్వే గ్రామ సభను గురువారం నిర్వహించనున్నట్లు తహసీల్దారు వెంకటేశ్వరరావు తెలిపారు. రీ-సర్వే సంబంధిత సమస్యలను ఈ సభలో అధికారులకు తెలియజేవచ్చన్నారు.

భీమవరం

• భీమవరం • ఉండి

వసతి గృహాల పరిశీలన

ఉండి, న్యూస్‌టుడే: ఉండిలోని బీసీ కళాశాల బాలుర, పెదపేటలో ఎస్సీ బాలిక వసతి గృహాలను మహిళా కమిషన్ సభ్యురాలు బూసి వినీత బుధవారం పరిశీలించి మాట్లాడారు. ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు కృషితో ఇక్కడి వసతి గృహాల్లో ఆధునిక సౌకర్యాలు సమకూరాయన్నారు. విశ్రాంతి గదుల్లో విద్యుదీకరణ, గాలి పంకాలు, ఆధునిక బెడ్స్ ఏర్పాటు చేయించడం అభినందనీయమన్నారు. తెదేపా మండల అధ్యక్షుడు కరిమెరక నాగరాజు, పట్టణ అధ్యక్షుడు కాగిత బుజ్జి, సీడీపీవో వాణి విజయరత్నం తదితరులు పాల్గొన్నారు.



స్థానిక నాయకులు, అధికారులతో వినీత

శిథిల భవనాలు.. ఇరుకు గదులు!

ఆరోగ్య ఉప కేంద్రాల్లో కనీస వసతులూ కరవే..



భీమవరం మండలం దొంగపిండిలో ఆరోగ్య ఉప కేంద్రం ఇది. దీన్ని 2014 అక్టోబరులో నాటి ప్రభుత్వం రూ.11 లక్షల వ్యయంతో నిర్మించింది. వైకాపా అధికారంలోకి వచ్చాక నిర్వహణను గాలి కొదిలేశారు. కనీస మరమ్మతులు కూడా చేయక పోవడంతో క్రమంగా శిథిలావస్థకు చేరింది. గోడలు దెబ్బతిని పెచ్చులూడుతున్నాయి.

భీమవరం అర్బన్, న్యూస్‌టుడే: పల్లె ప్రజలకు వైద్య సేవలందించే ఆరోగ్య ఉప కేంద్రాల్లో కనీస వసతులు లేక ఇబ్బందులు తప్పడం లేదు. గ్రామ సచివాలయాలకు అనుసంధానంగా హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేస్తామంటూ గత వైకాపా పాలకులు ఆర్భాటంగా ప్రచారం చేసుకున్నా ఆచరణలో విఫలమైంది. కొన్నిచోట్ల మాత్రమే వాటిని నిర్మించారు. 85 శాతం ఆరోగ్య కేంద్రాలకు సొంత గూడు లేదు. కొన్ని శిథిల భవనాల్లోనే కొనసాగుతున్నాయి. దీంతో 104 వాహనం వస్తే చెరువుగట్లపై, ప్రభుత్వ భవనాల అరుగులపైన వైద్య పరీక్షలు చేయాల్సిన దుస్థితి ఏర్పడింది.



నాగిడిపాలెంలో వైద్యశాల నిర్వహిస్తున్న తుపాను రక్షిత భవనం

ఎంతో కీలకం.. గ్రామాల్లో ఆరోగ్య ఉపకేంద్రాల ద్వారా ఏడాది పొడవునా ప్రజలకు వివిధ రూపాల్లో వైద్యసేవలు అందుతుంటాయి. వీటి ద్వారానే ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, ఆరోగ్య సహాయకులు, ఆశా కార్యకర్తలు గర్భిణులు, బాలింతలకు వైద్య సేవలందిస్తారు. మందులను భద్రపరచాలన్నా.. పంపిణీ చేయాలన్నా, ప్రాథమిక చికిత్స అందించాలన్నా, పిల్లలకు టీకాలు వేయాలన్నా ఇవే ఆధారం. ఇంతటి కీలకమైన ఆరోగ్య ఉప కేంద్రాలను గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది.



చినఅమిరంలోని ఆరోగ్య ఉప కేంద్రంలో ఇలా ఇరుకు గదిలోనే వైద్యులు, సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. వైద్యులను పరీక్షించేందుకు, సామగ్రి, మందులను ఉంచేందుకు తగినంత స్థలం లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు.

• భీమవరం మండలంలో గొల్లవానితిప్ప, తుందుర్రు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలున్నాయి. వీటి పరిధిలోని 20 ఆవాస ప్రాంతాల్లో 21 ఆరోగ్య ఉపకేంద్రాలకు గాను నాలుగు చోట్ల మాత్రమే సొంత భవనాలున్నాయి

• వీరవాసరం మండలంలో వీరవాసరం, కొణితివాడ పీహెచ్‌సీల పరిధిలో 36 పల్లెలున్నాయి. 20 ఆరోగ్య ఉప కేంద్రాలకు గాను అయిదు చోట్ల మాత్రమే సొంత భవనాలున్నాయి.

ప్రతిపాదనలు పంపాం

ఎక్కడెక్కడ భవనాలు అవసరమో గుర్తించి ప్రతిపాదనలను ఉన్నతాధికారులకు పంపించాం. ఈ అంశం ప్రభుత్వం దృష్టిలో ఉంది. ప్రస్తుతానికి ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా వైద్య సేవలు అందేలా కృషి చేస్తున్నాం. - **ఈశ్వర్, అరుణరాణి, వైద్యాధికారులు**

తాగునీటి పథకాల ప్రక్షాళన

వీరవాసరం, న్యూస్‌టుడే: వీరవాసరం మండలంలో తాగునీటి పథకాల ప్రక్షాళనకు అధికారులు చర్యలు చేపట్టారు. మండలంలోని వీరవాసరం, రాయకుదురు, మత్స్యపురి, నందమూరుగరువు గ్రామాల్లో తాగునీటి పథకాలు, చెరువులు దయనీయంగా మారిన తీరుపై సెప్టెంబరు 29న 'ఈనాడు'లో 'చెరువు.. నిర్వహణ కరవు' శీర్షికతో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. వీరవాసరంలో రెండు తాగునీటి పథకాలకు మరమ్మతులు, చెరువుల్లో తూడు, వ్యర్థాల తొలగింపు పనులు చేపట్టారు. ఈ పనులకు పంచాయతీ నిధులు రూ. 24 లక్షలు వెచ్చిస్తున్నట్లు కార్యదర్శి లక్ష్మి తెలిపారు.

ఈనాడు స్పందన

అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ

పాలకోడేరు, న్యూస్‌టుడే: స్కూల్ గేమ్స్ రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు మోగల్లు పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు ఎంవీ త్రినాథులు తెలిపారు. ఈ నెల 22న గోపన్నపాలెంలో జరిగిన ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా స్థాయి పరుగు పోటీల్లో ఎస్‌డీఎన్ ప్రకాశ్, జి.ప్రణవి ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయికి అర్హత సాధించినట్లు పీడీ వీరమల్లు రాంబాబు తెలిపారు. ఎంపికైన విద్యార్థులను హెచ్ఎంతో పాటు సర్పంచి ఎం.కృష్ణకుమారి, ఎస్ఎంసీ ఛైర్మన్ కె.సుబ్రహ్మణ్యం, కలిదిండి సందీప్‌వర్మ తదితరులు అభినందించారు.



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపిక..భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: సౌత్‌జోన్ అంతర్ విశ్వవిద్యాలయాల పురుషుల బ్యాడ్మింటన్ పోటీలకు విష్ణు దంత కళాశాల విద్యార్థి వి.సోహన్‌దత్తా ఎంపికైనట్లు ప్రిన్సిపల్ ఏవీ రామరాజు తెలిపారు. చెన్నైలోని ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయ ఆవరణలో ఈ నెల 26 నుంచి 29వ తేదీ వరకు జరిగే పోటీల్లో ఈ విద్యార్థి పాల్గొంటారని పీడీ జీబీఎస్ కుమార్‌రాజు తెలిపారు.

ఫెన్సింగ్‌లో పతకాలు

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: ఆంధ్ర విశ్వవిద్యాలయం స్థాయి ఫెన్సింగ్ పోటీల్లో భీమవరంలోని ఆర్ఆర్‌వీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు పతకాలు సాధించినట్లు ప్రిన్సిపల్ వీకేజే ప్రసాద తెలిపారు. భీమవరంలోని సీఎస్ఎన్ కళాశాల మైదానంలో మంగళవారం జరిగిన పోటీల్లో రెండో స్థానంలో నిలిచిన బి.మనోహర్, డి.ఎలీషాను అధ్యాపకులు బుధవారం అభినందించారు.

టౌన్‌హాలు కార్యవర్గం ఎన్నిక

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: ఎల్‌హెచ్ టౌన్‌హాలు అభివృద్ధికి ప్రతి సభ్యుడు కృషి చేయాలని శాసన మండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు అన్నారు. టౌన్‌హాలు కార్యవర్గ ఎన్నిక సందర్భంగా బుధవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. గౌరవాధ్యక్షులుగా మెంటే పార్థసారథి, గవర శేషారావు, అధ్యక్షుడిగా కోళ్ల రామచంద్రరావు, ప్రధాన కార్యదర్శిగా గ్రంధి సురేష్, కార్యదర్శిగా బేతు కృష్ణారావు, కోశాధికారిగా ఫిరోజ్‌బాబులతో పాటు ఉపాధ్యక్షులు, సంయుక్త కార్యదర్శులు, సభ్యులను నియమించారు.



మాట్లాడుతున్న శాసనమండలి ఛైర్మన్ మోషేన్‌రాజు

ఉద్యోగ మేళాలో 29 మంది ఎంపిక

దుంపగడప (ఆకివీడు), న్యూస్‌టుడే: దుంపగడపలోని వీవీ గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, నేషనల్ కెరీర్ సర్వీస్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ఉద్యోగమేళాలో 29 మంది ఎంపికైనట్లు వైస్ ప్రిన్సిపల్ కె.ఆనందకుమార్ తెలిపారు. మొత్తం 81 మంది హాజరుకాగా ప్రైవేటు ఆర్థిక సంస్థల ప్రతినిధులు ముఖాముఖీల ద్వారా అభ్యర్థులను ఎంపిక చేశారు. స్కిల్ హబ్ కోఆర్డినేటర్ జి.శ్రీనివాసు పాల్గొన్నారు.

పోటీతత్వంతో వికాసం

'ఈనాడు' ప్రతిభా పాటవ పోటీలు

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: 'ఈనాడు' ప్రతిభా పాటవ పోటీలు భీమవరంలోని బార్దోలి ఆంగ్ల మాధ్యమ పాఠశాలలో బుధవారం జరిగాయి. 8, 9, 10 తరగతుల విద్యార్థులు పాల్గొని వారిలో దాగున్న సృజనాత్మకతకు పదును పెట్టారు. 'అంతర్జాల వినియోగంతో లాభ నష్టాలు, విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం' అంశంపై వ్యాస రచనలో తమ అభిప్రాయాలను వ్యక్తీకరించారు. ఈ పోటీలో ప్రతిభ కనబరిచిన 8వ తరగతి విద్యార్థినులు కె.భార్గవి, కె.కుసుమ కీర్తి వరుసగా ప్రథమ, ద్వితీయ, పదో తరగతి విద్యార్థిని సీహెచ్ మనోజ తృతీయ స్థానంలో నిలిచారు. పాఠశాల కరస్పాండెంట్ గంధం శ్రీదేవి వారికి బహుమతులు అందజేశారు.



వ్యాసరచన పోటీలో పాల్గొన్న విద్యార్థులు



విజేతలకు బహుమతులు అందిస్తున్న కరస్పాండెంట్ శ్రీదేవి

సమష్టి కృషితో విజయం

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా కృషి చేయాలని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు శ్రేణులకు సూచించారు. భీమవరంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తొలుత ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌ను పరిచయం చేశారు. ఏపీఐఐసీ ఛైర్మన్, తెదేపా జిల్లా అధ్యక్షుడు మంతెన రామరాజు, రాష్ట్ర వినియోగదారుల రక్షణ మండలి వైస్‌ఛైర్‌పర్సన్ పీతల సుజాత, జనసేన జిల్లా అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు, తెదేపా రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.



రాజశేఖర్‌ను పరిచయం చేస్తున్న ఎమ్మెల్యే రామాంజనేయులు

వేతనాలు అందక ఇబ్బందులు

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: వైకాపా ప్రభుత్వ హయాంలో నియమించిన క్లాప్ వాహన చోదకులకు మూడు నెలలుగా వేతనాలు అందక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నాయకుడు నెక్కంటి సుబ్బారావు పేర్కొన్నారు. ఆయన బుధవారం వాహన చోదకులతో కలిసి జనసేన జిల్లా అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావుకు వినతి పత్రం అందజేశారు. సమస్య పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ఏఐటీయూసీ కార్యవర్గ సభ్యుడు చెల్లబోయిన రంగారావు, నాయకులు కిలారి మల్లేశ్వరరావు పాల్గొన్నారు.



గోవిందరావుకు వినతిపత్రం ఇస్తున్న ఏఐటీయూసీ నాయకులు

CHANGE OF NAME

I, VANKAYALA SIVA GANGA NAGA VENKATA VAMSI KRISHNA (New Name) S/o. Vankayala Gangadhara Rao, Previously called VANKAYALA SIVA GANGA NAGA VENKATA VAMSI KRISHN (OLD NAME) Resident of 22-10-10, Tatavarthivari Street, Near Andhra Bank, BHIMAVARAM, W.G. Dist. A.P. 534201, do hereby declare that I have changed my Name from VANKAYALA SIVA GANGA NAGA VENKATA VAMSI KRISHN (Old Name as Per Passport) to VANKAYALA SIVA GANGA NAGA VENKATA VAMSI KRISHNA (New Name) for future all purposes.

ప్రకటన

నా క్లయింటు అయిన ప.గో.జిల్లా, భీమవరం మున్సిపల్ ఏరియా, 1వ వార్డు, తటవర్తి వారి వీధి, డోర్ నెం. 5-6-4/44 వాస్తవ్యులు (లేటు) చల్లా సూరన్న గారి కుమారుడు చల్లా లోకేశ్వరరావు (ఆధార్ నెం. 962586751033) గారు నాకు ఇచ్చిన సంజాయిషీపై యావన్మందికి తెలియ జేయునది ఏమనగా,

నా క్లయింటు ది. 15-10-2024 సం॥ తేదీన తన ఇంటి నుండి జిరాక్సు కొరకు భీమవరం తాలూకా ఆఫీసు సెంటరుకు వెళ్తుండగా తనకు, తన సోదరుడైన చల్లా జయకృష్ణ ప్రసాద్ గార్లకు చెందిన, తమ ఒరిజినల్ లింకు దస్తావేజులు అయిన 1) క్రయ దస్తావేజు నెం. 2241/1993, భీమవరం S.R.O. Dt. 09-06-1993, 2) క్రయ దస్తావేజు నెం. 636/1985, భీమవరం S.R.O. Dt. 16-02-1985, 3) క్రయ దస్తావేజు నెం. 784/1985, భీమవరం S.R.O. Dt. 28-02-1985 ర్లు గల కవరు మార్గమధ్యములో జారి పడిపోయినది. ఎంత వెతికిననూ దొరకలేదు. ఎవరికైనా సదరు దస్తావేజులు దొరికిన యెడల ఈ క్రింది అడ్రస్సుకు తెలియపర్చవలసినదిగా ఈ పత్రికా ప్రకటన ద్వారా తెలియపర్చడమైనది.

సం/- **గాలి ఉదయ సూర్య భాస్కర్**
అడ్వకేట్ BAL, BL
భీమవరం స్నేహ లా ఛాంబర్, భీమవరం,
తేదీ: 23-10-2024 సెల్: 94401 30279



నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న ప్రమోద్‌కుమార్‌రెడ్డి

మెరుగైన సేవలే లక్ష్యం

కొణితివాడ (వీరవాసరం), న్యూస్‌టుడే: గ్రామీణులకు మెరుగైన బ్యాంకింగ్ సేవలు అందించడమే లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు ఛైర్మన్ కె. ప్రమోద్ కుమార్‌రెడ్డి అన్నారు. కొణితివాడలో బ్యాంకు నూతన భవనాన్ని ఆయన బుధవారం ప్రారంభించారు. మేనేజర్ ఎస్. శ్రీనివాసరెడ్డి, మాజీ సర్పంచి యరకరాజు వెంకట సుబ్రహ్మణ్యంరాజు తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో ప్రత్యేక నిఘా

ఆకివీడు, న్యూస్‌టుడే: నేరాలు, చోరీల నియంత్రణకు చర్యలు చేపట్టినట్లు ఆకివీడు సీఐ జగదీశ్వరరావు తెలిపారు. ఆకివీడు పట్టణం, మండలంలో పలు గ్రామాల పరిధిలో సీసీ కెమెరాల పనితీరుపై ఆయన బుధవారం సమీక్షించారు. ఆకివీడు పోలీస్ స్టేషన్‌లో సీసీ కెమెరాలు అనుసంధానం చేసిన సాంకేతిక యూనిట్‌ను, సీసీ ఫుటేజీలను పరిశీలించారు. పనిచేయని సీసీ కెమెరాలను గుర్తించి మరమ్మతులు చేయిస్తామని సీఐ తెలిపారు. ఆయన వెంట ఎస్సై నాగరాజు, సిబ్బంది ఉన్నారు.

అపరిచిత వ్యక్తులతో జాగ్రత్త

వీరవాసరం, న్యూస్‌టుడే: ఆటోలు, బస్సుల్లో ప్రయాణించే వారు అపరిచిత వ్యక్తుల విషయంలో అప్రమత్తంగా వ్యవహరించాలని వీరవాసరం ఎస్సై ఎం. రాజబాబు సూచించారు. ఇటీవల ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన ఆయన చోరీల కట్టడికి చర్యలు చేపట్టారు. వీరవాసరం, నవుడూరు జంక్షన్ ప్రాంతాల్లో గతంలో చోరీలకు పాల్పడిన మహిళల చిత్రాలతో ఉన్న ఫ్లెక్సీలను ఏర్పాటు చేయించి ప్రయాణికులను అప్రమత్తం చేస్తున్నట్లు తెలిపారు.

భీమవరం సినిమాలు

భీమవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే

శ్రీపద్మాలయ స్క్రీన్ 1	వేట్టయన్
శ్రీపద్మాలయ స్క్రీన్ 2	దేవర
కిషోర్ స్క్రీన్ 1	విశ్వం
కిషోర్ స్క్రీన్ 2	ఇద్దరు
నటరాజ్	జనక అయితే గనక
ఏవీజీ సినిమాస్ స్క్రీన్ 1	వేట్టయన్
ఏవీజీ సినిమాస్ స్క్రీన్ 2	సత్యం సుందరం
ఏవీజీ సినిమాస్ స్క్రీన్ 3	శ్వాగ్
ఏవీజీ సినిమాస్ స్క్రీన్ 4	దేవర
విజయలక్ష్మి స్క్రీన్ 1	మార్టిన్
మహాలక్ష్మి స్క్రీన్ 2	కల్లు కాంపౌండ్

ఎన్నాళ్లీ కష్టాలు..!

భీమవరం అర్బన్, న్యూస్‌టుడే: భీమవరం రెండో పట్టణ పరిధిలోని వివేకానందనగర్ కాలనీలో కనీస వసతులు లేక నివాసితులు నిత్యం అవస్థలు ఎదుర్కొంటున్నారు. ఈ కాలనీ ఏర్పడి 3 దశాబ్దాలు దాటినా డ్రెయినేజీ వ్యవస్థ లేదు. చిన్నపాటి వర్షం వచ్చినా ప్రధాన, అంతర్గత రహదారులు జలమయమవుతున్నాయి. ఎక్కడి మురుగు అక్కడే నిలిచిపోతుంది. కొన్ని ప్రాంతాల్లో రహదారి నిర్మాణమూ జరగలేదు. పురపాలక సంఘానికి పన్నులు చెల్లిస్తున్నా కనీస వసతులు కల్పించడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ అంశంపై పురపాలక డీఈ శ్రీనివాస్ స్పందిస్తూ ఆ ప్రాంతాన్ని పరిశీలించి అవసరమైన పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తామన్నారు.



దారి పొడవునా గండాలే..!

ఆకివీడు, న్యూస్‌టుడే: ఆకివీడులో గుమ్ములూరు కూడలి వద్ద ఇలా భారీ గుంతలు ఏర్పడటంతో వాహన చోదకులు అవస్థలు పడుతున్నారు. ఈ మార్గం పొడవునా పలు ప్రాంతాల్లో గుంతలు ఏర్పడగా ఇటీవల వర్షాలకు వాటిలో నీరు నిలిచింది. కొన్ని ప్రాంతాల్లో గుంతలు దాదాపు అడుగు లోతు ఉండటంతో పలువురు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఎప్పుడూ రద్దీగా ఉండే ఈ రహదారి కూడలి వద్ద వాహనాలు దిగబడిపోతున్నాయి. ఈ సమస్యను ఆర్అండ్‌బీ ఏఈ కె.శ్రీహరిరాజు దృష్టికి తీసుకెళ్లగా గోతులను పూడ్చించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.



గుమ్ములూరు కూడలి వద్ద ఇలా..

ఇళ్ల మధ్యే మురుగు!

గొల్లలకోడేరు (పాలకోడేరు), న్యూస్‌టుడే: గొల్లలకోడేరు పంచాయతీ పరిధి 10వ వార్డు వాసులు నిత్యం మురుగు సమస్యతో సతమతమవుతున్నారు. ఇక్కడ రహదారి పల్లంగా ఉండటం, డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో వాననీరు, మురుగు ఇళ్ల మధ్య నిలిచిపోతోంది. గత నెల రోజుల నుంచి నిత్యం దుర్వాసన, దోమల బెడదతో నరకం అనుభవిస్తున్నామని స్థానిక మహిళలు వాపోతున్నారు. ఎన్నికలకు ముందు సుమారు రూ.10 లక్షల వ్యయంతో ఇక్కడ ఈ సీసీ రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేసినా పనులు మాత్రం జరగలేదని చెబుతున్నారు. మురుగు నిలిచిపోకుండా చర్యలు తీసుకుంటామని పంచాయతీ కార్యదర్శి నాగేంద్రకుమార్ తెలిపారు.



హామీల అమలు కోరుతూ నిరసన

కాళ్ల, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయాలని కాంగ్రెస్ పార్టీ ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వేగేశ్న వెంకట గోపాలకృష్ణంరాజు డిమాండ్ చేశారు. కాళ్లకూరు గ్రామంలో ఆ పార్టీ నాయకులు బుధవారం పోస్టుకార్డులతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. పార్టీ మండలాధ్యక్షుడు కొల్లి సత్యశ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

29న ధన్వంతరి జయంతి

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: నాయీ బ్రాహ్మణ సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 29న ధన్వంతరి జయంతి నిర్వహిస్తామని నాయీ బ్రాహ్మణ ఉద్యోగ, సాంస్కృతిక సంక్షేమ సంఘం ప్రతినిధులు తెలిపారు. బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు ఎంవీ సత్యనారాయణ, కార్యదర్శి సీహెచ్ బంగార్రావు, కోశాధికారి పీవీవీ సత్యనారాయణ ఈ వివరాలు వెల్లడించారు. ధన్వంతరి జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని కోరారు.

అవి ఇవి అన్నీ

పారిశుద్ధ్య నిర్వహణకు ప్రాధాన్యం

పాలకోడేరు, న్యూస్‌టుడే: గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణకు ప్రాధాన్యం ఇవ్వాలని ఎంపీడీవో వి. రెడ్డియ్య కార్యదర్శులకు సూచించారు. పాలకోడేరు మండల పరిషత్తు కార్యాలయంలో పంచాయతీల్లో పరిపాలన, మౌలిక సౌకర్యాల మెరుగుపై కార్యదర్శులకు సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. పీఆర్ యాప్ నిర్వహణ, పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, అభివృద్ధి పనుల ఎంపికపై సూచనలు చేశారు.

విగ్రహం తొలగింపుపై నిరసన

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: భీమవరం ఒకటో పట్టణ పరిధిలోని ఓ పాఠశాల వద్ద సరస్వతీ మాత విగ్రహం తొలగింపును నిరసిస్తూ ఖండిస్తూ అఖిల భారతీయ విద్యార్థి పరిషత్తు ఆధ్వర్యంలో బుధవారం ధర్నా చేశారు. విగ్రహం తొలగింపును తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఆ సంఘం భీమవరం పట్టణ కన్వీనర్ కాయిత డిన్నుచందు తెలిపారు.

పాఠశాలకు సామగ్రి అందజేత

చినఅమిరం (భీమవరం గ్రామీణ), న్యూస్‌టుడే: కార్పొరేట్ సామాజిక బాధ్యత(సీఎస్ఆర్)లో భాగంగా ఎస్‌బీఐ ఆధ్వర్యంలో కంప్యూటర్లు, ప్రింటర్లు ఇతర సామగ్రిని చినఅమిరం ఉన్నత పాఠశాలకు బుధవారం అందజేసినట్లు చీఫ్ మేనేజర్ గొట్టుముక్కల శ్రీనివాసరాజు తెలిపారు.

వరికి తెగుళ్ల బెడద

బొబ్బనపల్లి (వీరవాసరం), న్యూస్‌టుడే: పురుగు మందుల వినియోగం తగ్గిస్తే ఆరోగ్యకరమైన పంట ఉత్పత్తులను పొందవచ్చని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకుడు సీహెచ్ శ్రీనివాస్ అన్నారు. బొబ్బనపల్లిలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితులతో వరి చేలకు తెగుళ్లు ఆశిస్తున్నాయన్నారు. స్థానిక వ్యవసాయ అధికారుల సూచనల మేరకు తగు చర్యలు తీసుకోవాలన్నారు.

ప్రభాస్ అభిమానుల సందడి

భీమవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే: ప్రముఖ సినీ కథనాయకుడు ప్రభాస్ పుట్టిన రోజు వేడుకలను భీమవరం మార్కెట్ యార్డు ఆవరణలో బుధవారం నిర్వహించారు. పలువురు బుల్లితెర నటులు నృత్యాలతో సందడి చేశారు. ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు, తెదేపా జిల్లా అధ్యక్షుడు మంతెన రామరాజు, జనసేన జిల్లా అధ్యక్షుడు కొటికపూడి గోవిందరావు తదితరులు పాల్గొని నిర్వాహకులను అభినందించారు.

ఇరువర్గాల ఘర్షణ

భీమవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే: ప్రభాస్ పుట్టిన రోజు వేడుకల నిర్వహణకు సంబంధించి పట్టణంలో ఇటీవల రెండు వర్గాల అభిమానులు వేర్వేరుగా విలేకరుల సమావేశాలు నిర్వహించి పరస్పర ఆరోపణలు చేసుకున్నారు. ఈ వివాదాల నేపథ్యంలో మంగళవారం రాత్రి రెండువర్గాల మధ్య మార్కెట్ యార్డు ఆవరణలో ఘర్షణ చోటు చేసుకుంది.

FORM NO.14 [See Regulation 33(2)]

OFFICE OF THE RECOVERY OFFICER-I
DEBTS RECOVERY TRIBUNAL
(Department of Financial Services, Ministry of Finance, Government of India)
31-31-21, Narayana Bhavanam, Sai Baba Street, Dabagardens, Visakhapatnam-530 020.

DEMAND NOTICE

(NOTICE UNDER SECTIONS 25 TO 28 OF THE RECOVERY OF DEBTS & BANKRUPTCY ACT, 1993 AND RULE 2 OF SECOND SCHEDULE TO THE INCOME TAX ACT, 1961)

RC/69/2023 **Date: 27.09.2024**

IDBI Bank Limited, Danvaipeta Branch, Rajahmundry, East Godavari District.
Versus
Sri Yellabandi Venkateswara Rao & Others

To:
(CD 3) Sri Vanapalli Leela Prasad, S/o. Sri Pallaiah, Main Road, Akiveedu Mandal, West Godavari District.

1. This is to notify that as per the Recovery Certificate issued in pursuance of orders passed by the Hon'ble Presiding Officer, Debts Recovery Tribunal, Visakhapatnam in **OA/25/2014** an amount of **Rs.11,18,96,996/-** (Rupees Eleven Crore Eighteen Lakhs Ninety Six Thousand Nine Hundred and Ninety Six Only) along with pendentellite and future interest **@13.75%** p.a. compounded with monthly rests from **20-01-2014** till realization /date of payment and costs become due against you (Jointly and severally/Fully/Limited).
2. You are hereby directed to pay the above sum within 15 days of the receipts of the notice, failing which the recovery shall be made in accordance with the Recovery of Debts Due to Banks and Financial Institutions Act, 1993 and Rules there under.
3. You are hereby ordered to declare on an affidavit the particulars of your assets on or before the next date of hearing.
4. You are hereby ordered to appear before the undersigned on **29/10/2024 at 10:30 a.m.** for further proceedings.
5. In addition to the sum aforesaid you will be liable to pay:
a) Such interest as is payable for the period commencing immediately after this notice of the execution proceedings.
b) All costs, charges and expenses incurred in respect of the service of this notice and other process that may be taken place for recovering the certificate amount.
6. Attention is invited to Rule 16 of the Second Schedule to the Income Tax Act, 1961 which is reproduced below:
16(1) Where a notice has been served on a defaulter under Rule 2, the defaulter or his representative in interest shall not be competent to mortgage, charge, lease or otherwise deal with any property belonging to him except with the permission of the Recovery Officer, nor shall any Civil Court issue any process against such property in execution of a decree for the payment of money.
16(2) Where an attachment has been made under this Schedule, any private transfer or delivery of the property attached or of any interest therein and any payment to the defaulter of any debt, dividend or other moneys contrary to such attachment shall be void as against all claims enforceable under the attachment.

(Given under my hand and the seal of the Tribunal, Visakhapatnam on this day 27th September 2024)

(Avasarala Anil)
Recovery Officer,
Debts Recovery Tribunal, Visakhapatnam

రైతుల సహకారంతో వివాదాల పరిష్కారం

నేలపోగుల, మడుగుపోలవరం (వీరవాసరం), న్యూస్‌టుడే: భూ తగాదాలున్న ఇరుపక్షాల రైతులు సహకరిస్తే సరిహద్దు వివాదాలు పరిష్కారమవుతాయని తహసీల్దారు ఏవీ రామాంజనేయులు అన్నారు. వీరవాసరం మండలం నేలపోగుల, మడుగుపోలవరం గ్రామాల్లో బుధవారం రీసర్వే గ్రామ సభలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లో కొలతల్లో తేడాలు, విస్తీర్ణంలో హెచ్చుతగ్గులపై పలువురు రైతులు అధికారులకు అర్జీలు అందజేశారు. మొత్తం 14 అర్జీలు వచ్చినట్లు ఉప తహసీల్దార్ సుబ్బారావు తెలిపారు.

విస్సాకోడేరు(పాలకోడేరు), న్యూస్‌టుడే: విస్సాకోడేరులో సర్పంచి బొల్లా శ్రీనివాస్ అధ్యక్షతన రీసర్వే గ్రామ సభను బుధవారం నిర్వహించారు. రైతుల నుంచి 30 అర్జీలు అందినట్లు తహసీల్దారు ఎన్‌బీ విజయలక్ష్మి, డిప్యూటీ తహసీల్దారు సూర్యనారాయణరాజు తెలిపారు.



మాట్లాడుతున్న తహసీల్దారు రామాంజనేయులు

ఆధార్ నవీకరణకు అవకాశం

ఉండి, న్యూస్‌టుడే: మహదేవపట్నంలో ఏర్పాటు చేసిన ఆధార్ నవీకరణ కేంద్రాన్ని జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి జుత్తిగ నాగరాజు, సర్పంచి వనిమా నాగ వెంకట సుబ్బలక్ష్మి, తెదేపా గ్రామ అధ్యక్షుడు వశ్రీనివాస్ బుధవారం పరిశీలించారు. నాగరాజు మాట్లాడుతూ ఆధార్ నవీకరణ, లోపాల సవరణకు అవకాశం కల్పించేలా ప్రభుత్వం ఈ కేంద్రాలను అందుబాటులోకి తెచ్చిందన్నారు.



కేంద్రాన్ని పరిశీలిస్తున్న నాయకులు

(c) eenadu

నరసాపురం

• నరసాపురం • పాలకొల్లు • ఆచంట

రైతుల ఓటరు జాబితా సిద్ధం చేయాలి


మాట్లాడుతున్న అనితాకుమారి

పెనుగొండ, న్యూస్‌టుడే: సాగునీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలకు సంబంధించిన రైతుల ఓటరు జాబితాను సిద్ధం చేయాలని తహసీల్దార్ అనితాకుమారి తెలిపారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలకు నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశానుసారం సాగునీటి సంఘాలకు నిర్వహించనున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని త్వరితగతిన ఎన్నికల జాబితా తయారు చేయాలని వివరించారు. జలవనరులశాఖ మార్టేరు ఎఈఈ జి.జయశంకర్, డీటీ డి.రాజేష్ పాల్గొన్నారు.

నిత్యావసర సరకుల దుకాణాన్ని పరిశీలించిన ఆర్డీవో


సరకును పరిశీలిస్తున్న దాసి రాజు

నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే: కొప్పర్రులోని 89వ నంబరు నిత్యావసర సరకుల చౌక డిపోను ఆర్డీవో దాసి రాజు బుధవారం పరిశీలించారు. పేదలకు అందాల్సిన నిత్యావసర సరకులు సక్రమంగా అందుతున్నాయా లేదా అనే విషయమై పరిశీలించారు. డీలరు కడలి శ్రీనివాస్‌కు పలు సూచనలు చేశారు. ఆయన వెంట పౌర సరఫరాల ఉప తహసీల్దార్ అయితం సత్యనారాయణ, వీఆర్వో వినోద్ ఉన్నారు.

10 AM to 1 PM
మేమున్నాం.. మీకు తోడుగా..
నరసాపురం: 80085 74504
పాలకొల్లు: 80085 74510
ఆచంట : 91212 29087

పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే

సమస్య: స్థానిక కొత్త బ్యాంక్ కాలనీలో గత కొన్ని రోజులుగా వీధి దీపాలు వెలగడం లేదు. దీంతో రాత్రి సమయంలో ఇబ్బందిగా ఉంటుంది.
- వెంకట్, స్థానికుడు

సమాధానం: పరిశీలించి చర్యలు తీసుకుంటాం.
- రాజ్‌కుమార్, పురపాలక డీఈ

నరసాపురం, న్యూస్‌టుడే

సమస్య: పట్టణంలోని గోదావరి రేవుల్లో చెత్త పేరుకుపోయింది.
- రాంబాబు, నరసాపురం

సమాధానం: పరిశీలించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటా.
- ఎం.అంజయ్య, పురపాలక కమిషనర్

నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే

సమస్య: కొప్పర్రు - మత్స్యపురి రహదారి చెంత రక్షిత మంచి నీటి పైపు లైన్ సంప్‌లు మూతలు లేకుండా ప్రమాదకరంగా ఉన్నాయి.
- పొలిశెట్టి సత్యనారాయణ, కొప్పర్రు

సమాధానం: ప్రమాదకరంగా ఉన్న పైపులైన్ సంప్‌లపై మూతలు ఏర్పాటు చేయాల్సిందిగా గ్రామ కార్యదర్శి ఆనందబాబుకు సూచిస్తా.
- కె.నాగేంద్రకుమార్, ఈవోపీఆర్డీ

మొగల్తూరు, న్యూస్‌టుడే

సమస్య: ముత్యాలపల్లి- వారతిప్ప గ్రామాల మధ్య మురుగు కాలువ వంతెన సమీపంలో చెత్త వేయడంతో అక్కడ అపరిశుభ్ర వాతావరణం నెలకొంది.
- నాగరాజు, ముత్యాలపల్లి

సమాధానం: పరిశీలించి సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతా.
- మేడిద నవీన్‌కిరణ్, ఈవోపీఆర్డీ

పెనుగొండ గ్రామీణ, న్యూస్‌టుడే

సమస్య: రామన్నపాలెం వెళ్లే రహదారి పక్కన చెత్త వేస్తున్నారు. దీంతో ఆ ప్రాంతం అపరిశుభ్రంగా మారుతుంది.
- నానాజీ, స్థానికుడు, రామన్నపాలెం

సమాధానం: పరిశీలించి ఆ ప్రాంతాన్ని శుభ్రం చేయిస్తాం
- శ్రీనివాసరెడ్డి ఇన్‌ఛార్జి కార్యదర్శి

పెనుమంట్ర, న్యూస్‌టుడే

సమస్య: పోలమూరు పితాని కాలనీలో విద్యుత్తు దీపాలు సరిగా వెలగడం లేదు. దీంతో రాత్రి సమయంలో ఇబ్బందులు పడుతున్నాం.
- శ్రీను, స్థానికుడు

సమాధానం: రెండు రోజుల్లో సమస్యను పరిష్కరిస్తాం.
- సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి

స్పందనకు వందనం

పెనుగొండ, న్యూస్‌టుడే: చెరుకువాడ జడ్పీ ఉన్నత పాఠశాల సమీపంలో చెత్త పేరుకుపోయి దుర్గంధంతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్న వైనంపై ఈ నెల 20న 'మేమున్నాం.. మీకు తోడుగా..' శీర్షికన 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి పెనుగొండ సర్పంచి నక్కా శ్యామలాసోని, పంచాయతీ కార్యదర్శి రత్నాకరరావు స్పందించారు. పారిశుద్ధ్య సిబ్బందితో చెత్త తీయించారు.

సొంత గూడు లేక సౌకర్యాలు దూరం!

కొన్ని అంగన్‌వాడీలకే సక్షం అమలు

పాలకొల్లు, న్యూస్‌టుడే

★ యలమంచిలి మండలంలో మొత్తం 85 అంగన్‌వాడీ కేంద్రాలుండగా 34 మాత్రమే సొంత భవనాలున్నాయి. వీటిలో 4 చోట్ల మరుగుదొడ్లు లేవు. అందువల్ల కేవలం 30 కేంద్రాలకే సక్షం కార్యక్రమంలో చోటు లభించింది. ప్రస్తుతానికి పోషణవాటిక పేరిట పెరటితోటలు పెంచడానికి 30 మంది కార్యకర్తల ఖాతాలకే ఇక్కడ రూ.10 చొప్పున నిధులు జమయ్యాయి. సొంత భవనాలు పూర్తిచేయకపోవడంతో ఎంత నష్టపోయామనేది ఇప్పుడు తెలుస్తుందని పలువురు వాపోతున్నారు.



★ ఇది పాలకొల్లు మండలం వాలమర్రులో అసంపూర్తిగా ఉన్న అంగన్‌వాడీ భవనం. గత వైకాపా పాలనలో దీనికి పైసా విదల్చక పూర్తికాలేదు. తాజాగా కూటమి ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలను ఆహ్లాదకరంగా తీర్చిదిద్దడానికి సక్షం పేరిట కార్యక్రమాన్ని తీసుకొచ్చింది. ఇది సొంత భవనాలున్న కేంద్రాలకే పరిమితం చేయడంతో ప్రతి మండలంలోనూ పదుల సంఖ్యలో అంగన్‌వాడీలు అర్హత కోల్పోయాయి. అదే సొంత భవనాలు పూర్తి చేసి ఉంటే అన్నిచోట్ల ప్రగతి పనులు ఊపందుకుని చిన్నారులు, గర్భిణులకు ఉపయోగపడే కార్యక్రమాలు అమలయ్యే అవకాశం ఉండేది.

అంగట్లోనే అన్నీ..

ప్రాజెక్టు	మొత్తం అంగన్‌వాడీలు	ఎంపికైనవి
పాలకొల్లు	258	99
మొగల్తూరు	193	57

ఇప్పటికే తాగునీరు, మరుగుదొడ్ల ఏర్పాటు నిమిత్తం నిధులు మంజూరు చేసి పనులు జరుగుతుండగా కొత్త కార్యక్రమం అమల్లోకి తీసుకురావడంతో అంగన్‌వాడీలకు నూతన శోభ రానుంది. పెరటి తోటలు మొదలుకుని గోడలపై చిత్రాలు, ఆట వస్తువులు, చిట్టి కథలు, పాటలు వినిపించే దృశ్యశ్రవణ మాధ్యమాలు అందుబాటులోకి రానుండటం బాలల వికాసానికి తోడ్పడనున్నాయి. దీనిపై ఐసీడీఎస్ పాలకొల్లు పీవో ఇందిరను 'న్యూస్‌టుడే' సంప్రదించగా కార్యకర్తల ఖాతాలకు నిధులు జమయ్యాయన్నారు. ఉపాధి హామీ సిబ్బందితో కలిసి అందుబాటులో ఉన్న స్థలంలో పెరటితోటలు పెంచడానికి రంగం సిద్ధమవుతుందన్నారు.

విద్యార్థుల్లో 'విజ్ఞాన వికాసం'

'ఈనాడు' ప్రతిభాపాటవ పోటీలు



పాలకొల్లు పట్టణం, న్యూస్‌టుడే: విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపుదలకు, భావవ్యక్తీకరణకు ప్రతిభాపాటవ పోటీలు దోహదపడతాయని ప్రిన్సిపల్ డి.భవాని అన్నారు. 'ఈనాడు' ఆధ్వర్యంలో స్థానిక భారతీయ విద్యాభవన్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ప్రతిభాపాటవ పోటీలు బుధవారం నిర్వహించారు. అంతర్జాలం వినియోగంతో లాభనష్టాలు, విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ప్రథమస్థానంలో ఎం.దక్షిత (9వ తరగతి), ద్వితీయస్థానంలో ఎస్.ఎల్.ప్రణవి (9వ తరగతి), తృతీయస్థానంలో బి.ఎల్.హంసిక (9వ తరగతి) నిలిచారు. విజేతలకు ప్రధానోపాధ్యాయిని భవానీ బహుమతులు అందజేశారు.



పాలకొల్లు పట్టణం, న్యూస్‌టుడే: పాలకొల్లు సెయింట్ మెరీస్ ఉన్నత పాఠశాలలో 'ఈనాడు' ఆధ్వర్యంలో అంతర్జాలం వినియోగంతో లాభనష్టాలు, విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. వ్యాసరచన పోటీల్లో ప్రథమస్థానంలో ఎ.శ్రావ్య (10వ తరగతి), ద్వితీయస్థానంలో వి.ధర్మేష్‌కార్తీక్ (9వ తరగతి), తృతీయస్థానంలో కె.శృతిరూపిణి (8వ తరగతి) నిలిచారు. ప్రిన్సిపల్ సిస్టర్ ఎల్సీ విజేతలకు బహుమతులు అందజేశారు.



నరసాపురం, న్యూస్‌టుడే: వ్యాసరచన పోటీలతో విద్యార్థుల్లో 'విజ్ఞాన వికాసం' పెంపొందుతుందని ప్రధానోపాధ్యాయుడు బి.రాంబాబు అన్నారు. నరసాపురం మండలం కాపులకొడప జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభాపాటవ పోటీలు నిర్వహించారు. దీనిలో భాగంగా అంతర్జాలంతో కలిగే లాభ నష్టాలు, సామాజిక మాధ్యమాలు విద్యార్థులపై ప్రభావం అనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోటీలో ప్రతిభ కనబరిచి వరుసగా 1, 2, 3 స్థానాల్లో నిలిచిన వడ్డి నాగసత్యశ్రీ, ఉంగరాల ఊర్మిళాదేవి, పట్టా శృతిలకు ప్రధానోపాధ్యాయుడు బి.రాంబాబు బహుమతులు అందించారు.

అంకితభావంతో వైద్య సేవలు అందించండి


రోగులతో మాట్లాడుతున్న నాగరాణి

పెనుగొండ, న్యూస్‌టుడే: వైద్యులు రోగులకు అందుబాటులో ఉంటూ అంకితభావంతో వైద్య సేవలు అందించాలని కలెక్టర్ నాగరాణి తెలిపారు. బుధవారం స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. పేదలకు వైద్యం అందించడంలో నిర్లక్ష్యం వహిస్తే వారిపై చర్యలు చేపడతామన్నారు. రోగులు ఉండే వార్డులు, ల్యాబ్, ఇతర విభాగాలను పరిశీలించారు. వార్డుల్లో రోగుల ఆరోగ్య పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు. వైద్యులు ఎలా చూస్తున్నారు. అనంతరం సీహెచ్‌సీ వైద్యాధికారి చంద్రసవేరిని రోజుకు ఓపీ ఎంత మంది ఉంటారని అడిగారు. చంద్రసవేరి మాట్లాడుతూ సుమారు 150 నుంచి 200 ఉంటుందని వివరించారు. రోగులు, గర్భిణుల నుంచి పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి పరిసరాలను శుభ్రంగా ఉంచాలని వివరించారు.

స్వచ్ఛ నరసాపురం సాకారానికి సహకరించాలి


పారిశుద్ధ్య పనులు పర్యవేక్షిస్తున్న కమిషనర్ అంజయ్య

నరసాపురం, న్యూస్‌టుడే: స్వచ్ఛ నరసాపురం సాకారానికి సహకరించాలని పురపాలక కమిషనర్ ఎం.అంజయ్య ప్రజలు, సిబ్బందికి సూచించారు. పట్టణంలోని ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న చెట్ల తొలగింపు, అంతర్గత డ్రెయిన్లలో పూడిక తొలగింపు పనులు ఆయన బుధవారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ప్రసాద్, కిశోర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


మంత్రి దుర్గేష్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాయకర్

పర్యాటక అభివృద్ధికి సహకరించండి

నరసాపురం, న్యూస్‌టుడే: నియోజకవర్గంలోని సముద్రతీరంలో పర్యాటక అభివృద్ధికి సహకరించాలని ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ పర్యాటక, సాంస్కృతిక శాఖామంత్రి కందుల దుర్గేష్‌ను కోరారు. మంగళగిరిలోని మంత్రి కార్యాలయంలో ఆయన్ను నాయకర్ బుధవారం కలిసి ప్రతిపాదనలు అందించారు. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను కలిసిన నాయకర్ ఆయన్ను నియోజకవర్గానికి రావాలని ఆహ్వానించారు. టిడ్కో ఛైర్మన్ వేములపాటి అజయ్‌కుమార్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

లక్ష్యం మేరకు సభ్యత్వాల నమోదు

నరసాపురం, న్యూస్‌టుడే: లక్ష్యం మేరకు సభ్యత్వ నమోదు పూర్తిచేయాలని తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు అన్నారు. పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన పట్టణస్థాయి సమావేశానికి అధ్యక్షత వహించిన రామరాజు మాట్లాడారు. ఈ ఏడాది 40 వేల పార్టీ సభ్యత్వ నమోదు లక్ష్యమన్నారు. ఈ సమావేశంలో అధికారి అనంతరామారావు, జక్కం శ్రీమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న రామరాజు

పాదులు, చెత్త తొలగింపు

ఈనాడు కథనానికి స్పందన

ఆచంట, న్యూస్‌టుడే: ఆచంట - పాలకొల్లు రోడ్డులో శ్మశానవాటిక వద్ద చెత్త, వీధి దీపాలపైకి పాకిన పాదులు తొలగించారు. మంగళవారం 'నిర్లక్ష్యం వెలిగింది' శీర్షికతో చిత్ర కథనం ప్రచురితమైంది. దీనిపై అధికారులు స్పందించారు.

బదిలీ అయిన ఉద్యోగులకు సత్కారం

పెనుమంట్ర, న్యూస్‌టుడే: జుత్తిగ గ్రామంలో పనిచేసి బదిలీ అయిన పంచాయతీ కార్యదర్శి ముసలయ్య, వీఆర్వో శ్రీనివాసరావులను బుధవారం గ్రామ సర్పంచి తమనంపూడి వీర్రెడ్డి ఆధ్వర్యంలో సత్కరించారు. ఈ సందర్భంగా వారి సేవలను కొనియాడారు.

పాడైన గుడ్లు ఇచ్చారని ప్రచారం

ఆచంట, న్యూస్‌టుడే: ఆచంట మండలం వల్లూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో అక్టోబరు మొదటి వారంలో పాడైన కోడి గుడ్లు సరఫరా చేశారంటూ బుధవారం స్థానిక సోషల్ మీడియాలో జోరుగా ప్రచారం జరిగింది. సూపర్‌వైజర్‌పై వేటు వేయాలని అధికార పార్టీ నాయకులు కోరుతున్నట్లు కూడా పేర్కొన్నారు. దీనిపై కూటమి నాయకులను 'న్యూస్‌టుడే' ప్రశ్నించగా.. అలాంటి విషయం తమ దృష్టికి రాలేదని అన్నారు. దీనిపై పెనుమంట్ర సీడీపీవో కృష్ణకుమారిని వివరణ కోరగా ఆ విషయంలో వాస్తవం లేదని తెలిపారు. కేవలం ఒక లబ్ధిదారు తనకు పాడయిన గుడ్డు వచ్చినట్లు తెలపడంతో అప్పటికప్పుడే తిరిగి గుడ్లు అందించినట్లు వివరించారు.

రహదారి ప్రమాదంపై కేసు

నరసాపురం, న్యూస్‌టుడే: రహదారి ప్రమాదంలో వ్యక్తి గాయపడిన ఘటనపై బుధవారం కేసు నమోదు చేశామని పట్టణ ఎస్సై సీహెచ్ జయలక్ష్మి తెలిపారు. దీనికి సంబంధించి ఎస్సై కథనం మేరకు పట్టణానికి చెందిన బోడా సింగ్ లక్ష్మీనాయుడు ఈ నెల 22న ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా ఎదురుగా వచ్చిన ద్విచక్ర వాహనం ఢీకొంది. ఈ ఘటనలో గాయపడిన లక్ష్మీనాయుడును పట్టణంలోని ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. దీనికి సంబంధించి బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనదారుడు త్రుటిలో ప్రమాదం నుంచి బయటపడ్డ ఘటన పాలకొల్లు - భీమవరం బైపాస్ మార్గంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. బైపాస్ రోడ్డులోని పెంకుల పాడు సర్వీసు రోడ్డు వద్ద నరసాపురం నుంచి భీమవరం వైపు వెళ్తున్న ఒక కారు అటుగా ప్రయాణిస్తున్న ఒక ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. దీంతో ఒక వ్యక్తి తన ద్విచక్రవాహనంతో కలిసి 20 అడుగుల లోతులోకి దిగిపోయాడు. కారు ఆగకుండా వెళ్లిపోవడంతో ఘటన చూసిన స్థానికులు, ప్రయాణికులు హుటాహుటీన కిందకు దిగి ద్విచక్ర వాహనాన్ని, వ్యక్తిని పైకి తీసుకొచ్చారు. అతడికి ఎటువంటి గాయాలు కాకపోవడం అదృష్టమని స్థానికులు తెలిపారు.


వాహనాన్ని పైకి తీస్తున్న స్థానికులు

తాడాటలో రాణిస్తున్న చిన్నారులు

ప్రత్యేక శిక్షణతో క్రీడలపై పట్టు

పాలకొల్లు పట్టణం, న్యూస్‌టుడే

పోటీ ప్రపంచంలో రాణించాలంటే చదువుతో పాటు ఇతర అంశాల్లోనూ పట్టుసాధించడం తప్పనిసరి. దీనిని గుర్తించిన కొందరు విద్యార్థులు ఖాళీ సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ క్రీడల్లోనూ రాణించి భళా అనిపించుకుంటున్నారు. భీమవరంలో జిల్లా స్థాయిలో జరిగిన తాడాట పోటీల్లో పాలకొల్లు విద్యార్థులు గెలుపొంది రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు.



మంచి క్రీడాకారుడిగా..



తాడాటలో మంచి క్రీడాకారుడిగా పేరు సంపాదిస్తా. ఇక్కడ ఇచ్చే శిక్షణ మంచి మార్పునకు కారణంగా మారుతుందనే ధీమా ఉంది. అండర్-14లో కాంస్య పతకం సాధించా. క్రీడల్లో నైపుణ్యం పెంపొందించుకొని క్రీడాకారుడుగా ఎదగాలనేది నా లక్ష్యం. **- కె.నిఖిల్‌కుమార్, 7వ తరగతి**

రాష్ట్రస్థాయి రాణిస్తా



ప్రత్యేక శిక్షణ పొంది రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటా. తాడాట ఆడటం ఎంతో ఉల్లాసంగా ఉంటుంది. మరిన్ని మెలకువలు నేర్చుకొని మంచి క్రీడాకారిణిగా ఎదుగుతా. అండర్-14 విభాగంలో జిల్లాస్థాయిలో జరిగిన పోటీల్లో 2 బంగారు, 3 వెండి, 3 కాంస్య పతకాలు గెలుపొందా. భవిష్యత్తులో ఎస్సై కావాలనేది ఆకాంక్ష.
- ఆర్.విద్యాలక్ష్మి, 8వ తరగతి

క్రీడలంటే ఇష్టం



చిన్నప్పటి నుంచి క్రీడలంటే ఇష్టం. ఆ అవకాశం ఇక్కడ దొరికింది. జిల్లాస్థాయి అండర్-14 విభాగంలో ప్రతిభ కనబరిచి తృతీయస్థానంలో నిలిచా. క్రీడలపై ఉన్న ఆసక్తితో మరింత శిక్షణ పొంది భవిష్యత్తులో ఉన్నత స్థానం చేరుకుంటా.
- వి.విజ్ఞాన్, 6వ తరగతి

జాతీయ స్థాయిలో పాల్గొంటా..



ఎప్పటికైనా జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటా. ప్రత్యేక శిక్షణ తాడాటలో మెరుగ్గా నేర్చుకోవడానికి దోహదపడింది. జిల్లాస్థాయి పోటీల్లో 2 బంగారు పతకాలు సాధించా. జాతీయస్థాయిలో మంచి క్రీడాకారుడుగా ఎదగడమే లక్ష్యం. **- ఐ.దుర్గాసాయి అఖిల్, 10వ తరగతి**

అవి ఇవి అన్నీ

ఉచిత బస్సు హామీ అమలు చేయాలి

పాలకొల్లు పట్టణం, న్యూస్‌టుడే: ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన ఉచిత బస్సు హామీని వెంటనే అమలు చేయాలని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు యడ్ల శివాజీ డిమాండ్ చేశారు. సూపర్-6లో ఒకటైన మహిళలకు ఉచిత బస్సు హామీ అమలు చేయాలని కోరుతూ కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో పోస్ట్‌కార్డుల ఉద్యమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

విస్తృతంగా సభ్యత్వ నమోదు

పాలకొల్లు పట్టణం, న్యూస్‌టుడే: భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహించాలని భాజపా పట్టణ అధ్యక్షుడు జక్కంపూడి కుమార్ అన్నారు. స్థానిక కోడిగట్టు సరస్వతి శిశుమందిర్‌లో భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 30తో సభ్యత్వ నమోదు గడువు ముగుస్తుందన్నారు. ఇప్పటి వరకు పాలకొల్లులో 9వేలు పైబడి సభ్యత్వాలు నమోదు చేశామని చెప్పారు. భాజపా నాయకులు మామిడి శివయ్య, కొల్లి కొండాప్రసాద్, కొణిజేటి గుప్తా, ఉన్నమట్ల కబర్ధి తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఏఆర్ఎస్‌లో కొనసాగుతున్న శిక్షణ తరగతులు

మార్టేరు, న్యూస్‌టుడే: మార్టేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో సమగ్ర సస్యరక్షణ- మానవ వనరుల సంరక్షణ అంశంపై అయిదు రోజుల పాటు నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు మూడో రోజు బుధవారం కొనసాగాయి. తెగులు గుర్తింపు, సస్యరక్షణ, వృక్ష సంబంధిత కషాయాలు తయారీ, జీవ నియంత్రికల వాడకం వంటి అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఏడీఆర్ టి.శ్రీనివాస్, విస్తరణ విభాగం ప్రధాన శాస్త్రవేత్త ఎంవీ.కృషాజీ, తదితరులు పాల్గొన్నారు.

బాణసంచా దుకాణదారులు నిబంధనలు పాటించాలి

నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే: దీపావళి బాణసంచా దుకాణాల్లో ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలు పాటించాలని లేకుంటే చర్యలు తప్పవని జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి బి.శ్రీనివాసరావు అన్నారు. నరసాపురం - పాలకొల్లు జాతీయ రహదారి చెంత చిట్టవరం గ్రామ పరిధిలో ఏర్పాటు చేసిన దీపావళి హోల్ సేల్ దుకాణాలను ఆయన బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా మందుగుండు సామగ్రి తయారు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బాణసంచా దుకాణాల్లో జాగ్రత్తలు తీసుకోవాలని సూచనలు చేశారు. ఆయన వెంట నరసాపురం అగ్నిమాపక అధికారి కె.రామ్ భాస్కర్ ఉన్నారు.

ఏకాంబరేశ్వరస్వామికి అన్నాభిషేకం



పెనుగొండ, న్యూస్‌టుడే: స్థానిక కామాక్షి ఆలయంలో బుధవారం ఆరుద్ర నక్షత్రం సందర్భంగా ఆలయ అర్చకులు ఏకాంబరేశ్వరస్వామికి అన్నాభిషేకం చేశారు. వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పోలమూరులో గొంతెమ్మ గ్రామోత్సవం

పెనుమంట్ర, న్యూస్‌టుడే: పోలమూరులో గొంతెమ్మ గ్రామోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. డప్పు వాయిద్యాలు, డీజే బాక్సులు, బుట్టబొమ్మల సందడి మధ్య ఈ కార్యక్రమం సాగింది.

రీ సర్వేతో భూ సమస్యలు పరిష్కారం

పెనుగొండ గ్రామీణ, పోడూరు, నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే: భూ సమస్యలు సత్వర పరిష్కారం కోసం గ్రామ సభలు నిర్వహిస్తున్నామని తహసీల్దారు జి.అనిత కుమారి అన్నారు. ఇలపర్రు గ్రామంలో బుధవారం గ్రామ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భూ సమస్యలపై 35 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. సర్పంచి పద్మావతి, రైతులు పాల్గొన్నారు. పోడూరు మండలం పి.పోలవరంలో గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సయ్యద్ మౌలాన్ ఫాజిల్ ప్రజల నుంచి 65 అర్జీలను స్వీకరించారు. నరసాపురం మండలం లిఖితపూడి గ్రామ సచివాలయం వద్ద గ్రామ సర్పంచి పొతురాజు వరలక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన గ్రామ సభలో ఉప తహసీల్దార్ ఎన్ఎస్ఎస్‌వీ ప్రసాద్ మాట్లాడారు.

జీవాలన్నిటికీ నట్టల నివారణ మందులు

నరసాపురం, న్యూస్‌టుడే: మేకలు, గొర్రెలకు నట్టల నివారణ మందులు వేయాలని పశుసంవర్ధకశాఖ సంయుక్త సంచాలకుడు కె.మురళీకృష్ణ ఆ శాఖ వైద్యులకు సూచించారు. నరసాపురం, మొగల్తూరు మండలాల్లో నిర్వహిస్తున్న నట్టల నివారణా కార్యక్రమాన్ని ఆయన బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట డీడీ వజర్ హుస్సేన్, ఏడీ వై.సుధాకర్, పశువైద్యులు జి.నీలిమ, ఇంజేటి సురేంద్ర తదితరులు ఉన్నారు.

మద్యం దుకాణాలు వద్దంటూ ధర్నా

పెనుగొండ, న్యూస్‌టుడే: నివాస ప్రాంతాలకు దూరంగా మద్యం దుకాణాలను ఏర్పాటు చేయాలని పెనుగొండలో నూతనంగా ఏర్పాటు చేసిన మూడు మద్యం దుకాణాలను తొలగించాలని కోరుతూ బుధవారం రాత్రి తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో సీతారామునిపేటకు చెందిన మహిళలు, విద్యార్థులు ధర్నా చేశారు. తహసీల్దార్ అనితాకుమారితో పలువురు మహిళలు మాట్లాడుతూ విద్యార్థులు, మహిళలు రాత్రి సమయంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటామని మద్యం దుకాణాలను తొలగించాలని కోరారు.

వాలిన చెట్లు.. కూలితే...!



గ్రామాల్లో రహదారుల చెంతన వాలిన చెట్లు ప్రయాణికులను కలవర పెడుతున్నాయి. చెట్లు బలహీనకావడం, చనిపోయి మోడుగా మారడంతో ఆ మార్గంలో వెళ్లేందుకు వెనుకంజు వేస్తున్నారు. పోడూరు, పెనుమంట్ర, ఆచంట, పెనుగొండ మండలాల్లో ఈ సమస్య ఎక్కువగా కనిపిస్తోంది. పోడూరు, జిన్నూరు, వెలగలేరు-కవిటం రోడ్డులో కొబ్బరి, ఇతర చెట్లు ప్రమాదకరంగా మారాయి. మాముడూరు శివారు బొక్కావారిపాలెం వెళ్లే రోడ్డులో పొడవైన రెండు చెట్లు అందర్నీ భయపెడుతున్నాయి. చెన్నాడచెరువు - బ్రాహ్మణచెరువు రోడ్డులోనూ ఇదే పరిస్థితి ఉంది. గతంలో చెట్లు కూలిన ఘటనల్లో ఆచంట మండలంలో ఒకరు మృతి చెందగా పెనుగొండ మండలంలో మరొకరు గాయపడ్డారు. ఈ విషయమై ఆర్అండ్‌బీ ఏఈ యశ్వంత్ మాట్లాడుతూ బలహీనంగా ఉన్న చెట్లు గుర్తించి తొలగించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. **- న్యూస్‌టుడే, జిన్నూరు (పోడూరు)**

కుండీల్లో మొక్కలేవీ..!



పాలకొల్లులోని ప్రధాన రహదారి నడకదారిలో ఏర్పాటు చేసిన కుండీల్లో మొక్కలు కనుమరుగయ్యాయి. నిర్వహణ కొరవడటంతో ఈ పరిస్థితి ఏర్పడిందని స్థానికులు చెబుతున్నారు. అధికారులు పరిశీలించి కుండీలలో మొక్కలు ఏర్పాటు చేయాలని వారంతా కోరుతున్నారు. **- ఈనాడు, పాలకొల్లు**


మొగల్తూరు: కేకు కోస్తున్న మాధవనాయుడు

ప్రభాస్ జన్మదిన వేడుకలు

మొగల్తూరు, న్యూస్‌టుడే: యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్ అభిమానులు ఆయన జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నరసాపురం పట్టణం, మొగల్తూరులో ద్విచక్రవాహన ప్రదర్శన చేశారు. పలు చోట్ల ప్రభాస్ జన్మదిన కేకులు ఏర్పాటు చేసి కోశారు. మొగల్తూరు గాంధీబొమ్మల కూడలి, నరసాపురంలో ఆయన అభిమానులు ఏర్పాటు చేసిన కేకులను మాజీ ఎమ్మెల్యే బండారు మాధవనాయుడు కోసి పంపిణీ చేశారు.

పాలకొల్లు సాంస్కృతికం, న్యూస్‌టుడే: సినీ హీరో ప్రభాస్ పుట్టినరోజు వేడుకలను పాలకొల్లులో బుధవారం అభిమానులు ఘనంగా జరిపారు. ప్రధాన వీధుల్లో ద్విచక్ర వాహనాలపై ప్రదర్శనగా తిరిగారు. స్థానిక రాహుల్ వృద్ధాశ్రమంలో వృద్ధులకు మాజీ ఎమ్మెల్సీ అంగర రామమోహన్ అభిమానుల సమక్షంలో ఆహారం, దుస్తులు, పండ్లు, మిఠాయిలు అందించారు.

సమన్వయంతోనే పరిష్కారం

మొగల్తూరు, న్యూస్‌టుడే: ప్రతి సోమవారం నిర్వహించే 'ప్రజా వినతుల పరిష్కార వేదిక'లో ప్రజల నుంచి వచ్చే వినతులను వెంటనే పరిష్కరించేందుకు సమన్వయంతో పనిచేయాలని తహసీల్దారు రాజకిషోర్, ఎంపీడీవో త్రిశూలపాణి సూచించారు. మండల రెవెన్యూ కార్యాలయంలో బుధవారం పలుశాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడారు.


సమావేశంలో పాల్గొన్న అధికారులు

మహారాజశ్రీ నరసాపురం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో
Creditor I.P. No. 18/2021
Between:
మేడపాటి రామచంద్రారెడ్డి ... పిటీషనరు
And
1. ఆసూరి శైలజ, తండ్రి: శామ్యూల్, భర్త: షేక్ ఉస్మాన్, శరవణనగర్, పాలకొల్లు.
2. సత్తి నాగ శ్రీనివాసరెడ్డి, తండ్రి: సూర్రెడ్డి, మార్టేరు, పెనుమంట్ర మండలం.
3. గంధం పుష్పవాణి, భర్త: వెంకటేశ్వరరావు, మేడపాడు, యలమంచిలి మండలం
4. Official Receiver, West Godavari District, Eluru

... రెస్పాండెంట్లు

పై నెంబరు పిటిషన్‌లో 1వ రెస్పాండెంట్‌ను insolvent గా ప్రకటించమని పిటిషన్ దాఖలు చేసినందున ఎవరికైనా అభ్యంతరములు ఉన్నచో ది. 25-10-2024 తేదీన ఉదయం 10.30 గంటలకు శ్రీ కోర్టువారి ఎదుట హాజరై ఆక్షేపణలు తెలుపవలెను.
(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
పాలకొల్లు 22-10-2024 — సం/- మేడపాటి వెంకట రామారెడ్డి, న్యాయవాది, పాలకొల్లు, ప.గో॥జిల్లా

(c) eenadu

తాడేపల్లిగూడెం
• తాడేపల్లిగూడెం • తణుకు

వ్యాయామ చికిత్సతో సత్ఫలితాలు


ఫిజియోథెరపీ చేస్తున్న వైద్యుడు కృష్ణ మహేష్

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: పట్టణంలోని సుబ్బారావుపేట భవిత దివ్యాంగుల పాఠశాలలో వ్యాయామ చికిత్సపై అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యుడు శ్రీ కృష్ణ మోహన్ దివ్యాంగ బాలలకు వ్యాయామ చికిత్స చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతిరోజు వ్యాయామం చేయడం ద్వారా పిల్లల్లో సత్ఫలితాలు సాధించవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రత్యేక ఉపాధ్యాయుడు ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

డిసెంబర్ 14న జాతీయ లోక్ అదాలత్

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: డిసెంబర్ 14వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు 11వ అదనపు జిల్లా జడ్జి షేక్ సికిందర్ బాషా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజీపడ దగ్గ క్రిమినల్, సివిల్, బీమా తదితర కేసులను ఈ కార్యక్రమం ద్వారా పరిష్కరిస్తామని పేర్కొన్నారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మహా సరస్వతి హోమం

రామచంద్రరావుపేట(తాడేపల్లిగూడెం వన్‌టౌన్), న్యూస్‌టుడే: తాడేపల్లిగూడెం పట్టణం రామచంద్రరావుపేటలోని శ్రీకృష్ణ యోగధ్యాన మందిరంలో బుధవారం శ్రీ అభయ గణపతి, మహాసరస్వతి హోమాలను అర్చకుడు పొదిల శ్రీనివాస శర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. నవగ్రహ మండపారాధన, కలశ స్థాపన, రక్షాబంధన, అష్టోత్తర శత నామ పూజలు నిర్వహించారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా రోగాలు దరి చేరవని మలేరియా సబ్ యూనిట్ అధికారి వై.వి.లక్ష్మణరావు పేర్కొన్నారు. స్థానిక 34, 35 వార్డుల్లో ఇంటింటా సర్వే కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. నీటి నిల్వలను గుర్తించి తొలగించారు. కార్యక్రమంలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

25 నుంచి జాతీయ పశుగణన

పెంటపాడు, న్యూస్‌టుడే : ఈనెల 25వ తేదీ నుంచి జాతీయ పశుగణన కార్యక్రమం చేపడుతున్నట్లు పెంటపాడు డివిజన్ పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎల్‌కే సుధాకర్ బుధవారం తెలిపారు. ఇప్పటికే సిబ్బందికి శిక్షణ పూర్తిచేసి అవసరమైన వనరులు సమకూర్చామన్నారు. నాలుగు నెలల పాటు ఇంటింటి సర్వే నిర్వహించి పశు సంపద సంఖ్యను నిర్ధారిస్తామన్నారు. పశుగణన సర్వేకి రైతులంతా సహకరించాలని కోరారు.

స్వర్ణకార కార్పొరేషన్ ప్రకటనపై హర్షం

తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే: రాష్ట్ర విద్యాశాఖా మంత్రి నారా లోకేశ్ స్వర్ణకార కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని ఇటీవల ప్రకటించిన నేపథ్యంలో బుధవారం స్థానిక ఎన్డీయే కార్యాలయంలో స్వర్ణకార సంఘం సభ్యులు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు నాగుమల్లి సాంబశివరావు, ప్రధాన కార్యదర్శి కోరుమిల్లి సుబ్బారావు, కోశాధికారి వెండి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్తు సమస్యల పరిష్కార వేదిక రేపు

ఉంగుటూరు, న్యూస్‌టుడే: నారాయణపురం విద్యుత్తు ఉప కేంద్రం కార్యాలయంలో వినియోగదారుల సమస్యలపై సీజీఆర్ఎఫ్, ఏపీఈపీడీసీఎల్ ఆధ్వర్యాన శుక్రవారం పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఈఈ అంబేడ్కర్ తెలిపారు. సీజీఆర్ఎఫ్ ఛైర్మన్ సత్యనారాయణ, సాంకేతిక సభ్యురాలు ఎస్ఎం మణి హాజరవుతారని, ఉంగుటూరు, నిడమర్రు మండలాల వినియోగదారులు పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోవాలని బుధవారం ఒక ప్రకటనలో కోరారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

తాడేపల్లిగూడెం	:79950 67078
పెంటపాడు	:79939 36123
తణుకు గ్రామీణ	:85558 50851
అత్తిలి	:91548 46774

10 AM to 1 PM

తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే

.సమస్య: పట్టణ పరిధి తాళ్లముదునూరుపాడులోని ప్రధాన రోడ్డులో చెత్త పేరుకుని రహదారిలోకి వస్తోంది
- శ్రీనివాస్, స్థానికుడు

సమాధానం: పరిశీలించి ప్రధాన రహదారిలో చెత్త తొలగించేలా చర్యలు చేపడతాం **- సోమేశ్వరరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్**

సమస్య: తాడేపల్లిగూడెం పట్టణం మహలక్ష్మినగర్ రెండో రోడ్డులో మురుగుబోదెలో నీరు నిల్వ ఉండటంతో భరించలేని దుర్వాసన వస్తోంది
- నవీన్, స్థానికుడు

సమాధానం: పరిశీలించి మురుగునీరు సాఫీగా ముందుకు సాగేలా చర్యలు చేపడతాం **- శ్రీమన్నారాయణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్**

పెంటపాడు, న్యూస్‌టుడే

సమస్య: పెంటపాడు యూనియన్ బ్యాంకు సమీపంలో రహదారిపై చెత్త పేరుకుపోయింది. పంచాయతీ వారికి ఫిర్యాదు చేసినా ఇంకా తొలగించలేదు. **- రమేష్, స్థానికుడు**

సమాధానం: చెత్త తొలగించేందుకు వెంటనే చర్యలు చేపడతాం. **- బాలకృష్ణ, పంచాయతీ కార్యదర్శి**

సమస్య: పెంటపాడులోని సంత బజారు అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది. రాత్రీపగలూ తేడా లేకుండా మందుబాబులు మద్యం తాగుతున్నారు. **- రామారావు, స్థానికుడు**

సమాధానం: రైతు బజారు ప్రాంతంలో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటాం. పోలీసు సిబ్బందితో పహారా కాయిస్తాం. **- స్వామి, ఎస్సై**

నడకదారుల ఆక్రమణ

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే


రోడ్డుపై నిలిపిన కారు

పార్కింగ్ స్థలాలు ఎక్కడ?

తాడేపల్లిగూడెం పట్టణ ప్రధాన రహదారుల్లో నడకదారులు ఆక్రమణలకు గురయ్యాయి. దుకాణ యజమానులు తమ సామగ్రిని ఫుట్‌పాత్‌లపైనే ఉంచుతున్నారు. ఎక్కడపడితే అక్కడ పలువురు రోజువారి దుకాణాలు ఏర్పాటు చేసుకుని వ్యాపారాలు సాగిస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా నిర్వహిస్తున్నా అడ్డుకునే పరిస్థితి కనిపించడం లేదు. ప్రధాన కూడళ్లు, రద్దీ ప్రాంతాల్లో పరిస్థితి మరింత దయనీయంగా ఉంటోందని పాదచారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎన్టీఆర్ చౌక్, తాలూకా కూడలి, పోలీస్ ఐలాండ్, ఎస్వీఆర్ సర్కిల్ వంటి ప్రాంతాలతో పాటు ఏలూరు, భీమవరం, కేఎన్ రోడ్లలో ఫుట్‌పాత్‌లపై అధిక సంఖ్యలో దుకాణాలు వెలిశాయి. సాయంత్రం వేళ వీటి సంఖ్య రెట్టింపవుతోందని స్థానికులు వాపోతున్నారు. ఆయా దుకాణాలకు వచ్చే కొనుగోలుదారులు తమ వాహనాలను అక్కడే నిలపడంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. ఈ విషయంపై కమిషనర్ ఏసుబాబు మాట్లాడుతూ ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.



జూబ్లీ రోడ్డులో రైల్వే స్టేషన్ ఉండటంతో వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుంది. దీనికి తోడు ఈ మార్గంలో బ్యాంకులు, హోటళ్లు, పాఠశాలలు, చర్చిలు ఉండటంతో వేల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఇక్కడ పార్కింగ్ వ్యవస్థ లేకపోవడంతో రోడ్డుపైనే నిలుపుతున్నారు. దీంతో తరచూ ట్రాఫిక్ సమస్యలు వస్తున్నాయి.



స్థానిక కేఎన్ రోడ్డులో రెండు వైపులా ఫుట్‌పాత్‌పై దుకాణాలు ఏర్పాటు చేయడంతో రాకపోకలు సాగించేందుకు పాదచారులు అవస్థలు పడుతున్నారు. దుకాణాలకు సంబంధించి హోర్డింగ్, బ్యానర్లను సైతం ఫుట్‌పాత్‌లపైనే ఏర్పాటు చేస్తుండటం గమనార్హం.

కనిపించని స్థలాలు

పట్టణంలో ఇరుకైన రహదారులతో రోజురోజుకీ ట్రాఫిక్ సమస్య తీవ్రమవుతోంది. దుకాణదారులు వాహన సెల్లారులను కూడా గదులుగా మార్చి బాడుగకు ఇచ్చారు. వాహనదారులకు పార్కింగ్ స్థలాలు కనుచూపుమేర కనిపించడం లేదు. దీంతో వాహనాలను ఫుట్‌పాత్‌లపై నిలుపుతున్నారు. ఫలితంగా పాదచారులు నడిచేందుకు మార్గం లేకుండా పోతోంది.

పట్టభద్రులుగా ఓటు నమోదు చేసుకోవాలి


మాట్లాడుతున్న బాబ్జీ

తాడేపల్లిగూడెం టూటౌన్, న్యూస్‌టుడే : త్వరలో జరగబోయే ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను తెదేపా నాయకులు, కార్యకర్తలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలని ఆ పార్టీ తాడేపల్లిగూడెం నియోజకవర్గ ఇన్‌ఛార్జి వలవల బాబ్జీ అన్నారు. స్థానిక తెదేపా కార్యాలయంలో పట్టభద్రుల ఎన్నికలు, పార్టీ సభ్యత్వాలపై వలవల బాబ్జీ అధ్యక్షతన ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో బాబ్జీ మాట్లాడుతూ అర్హత ఉన్నవారు ఓటు నమోదు చేసుకుని ఎన్డీయే అభ్యర్థిని గెలిపించాలని కోరారు. ఈ నెల 26వ తేదీ నుంచి పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నియోజకవర్గంలో ప్రారంభిస్తామన్నారు. సభ్యత్వ నమోదులో రాష్ట్రంలోనే మొదటి వరుసలో నియోజకవర్గం ఉండేలా నాయకులు కార్యకర్తలు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు పట్నాల రాంపండు, కిలపర్తి వెంకట్రావు, పరిమి రవికుమార్, గంధం సతీష్, పసల అచ్యుతం, క్లస్టర్, యూనిట్ ఇన్‌ఛార్జులు పాల్గొన్నారు.


పరీక్ష రాస్తున్న విద్యార్థులు

విజ్ఞాన వికాసం
'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు


బహుమతులు అందుకున్న విజేతలతో డైరెక్టర్, ప్రిన్సిపల్

తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే: 'ఈనాడు' ఆధ్వర్యంలో తణుకు పట్టణంలోని బెల్‌వెథర్ ఆంగ్ల మాధ్యమ పాఠశాలలో బుధవారం ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు 'అంతర్జాలంతో లాభనష్టాలు, విద్యార్థులపై సామాజిక మాధ్యమం ప్రభావం' అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో 8, 9, 10 తరగతుల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పొన్నా నాగ కీర్తిక, తనోజ్ సత్యశ్రీకర్, బ్రాహ్మణి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. విజేతలకు పాఠశాల డైరెక్టర్ దీపక్ కుమార్, ప్రిన్సిపల్ వినితా శామ్యూల్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల కోఆర్డినేటర్స్ స్వాతి, ప్రియాంక పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని అథోగతి పాలు చేసిన జగన్: ఆరిమిల్లి


మాట్లాడుతున్న రాధాకృష్ణ

తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే: జగన్‌మోహన్‌రెడ్డి అయిదేళ్లపాటు పాలనను గాలికొదిలేసి తాడేపల్లి ప్యాలెస్‌కు పరిమితమై రాష్ట్రాన్ని అథోగతి పాలు చేశారని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ఆరోపించారు. తణుకు ఎన్డీయే కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జాతీయ రికార్డుల ప్రకారం జగన్ అయిదేళ్ల పాలనలో 2 లక్షల మంది మహిళల మీద దాడులు, హత్యాచారాలు జరిగాయని, అది వాస్తవమా కాదా అనేది జగన్ ఆత్మపరిశీలన చేసుకోవాలన్నారు. ఇక్కడ మంత్రిగా పనిచేసిన వ్యక్తి మున్సిపాలిటీని భ్రష్టు పట్టించారని విమర్శించారు. రాబోయే రోజుల్లో కూటమి అందించే సంక్షేమం, అభివృద్ధికి వైకాపా తుడిచిపెట్టుకుపోతుందన్నారు. ★ తణుకు మండలం కోనాలలో రాధాకృష్ణ ఆధ్వర్యంలో గ్రామదర్శిని కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ తిరిగి ప్రజలను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. గ్రామంలో డ్రెయిన్లు, రహదారుల నిర్మాణానికి కృషి చేస్తానన్నారు. * తణుకు బాలగంగాధర్ తిలక్ ఆడిటోరియం వద్ద నిత్యావసర సరకుల కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. ప్రజలకు తక్కువ ధరల్లో నిత్యావసర వస్తువులు అందించేందుకు ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. ★ ప్రజలు వ్యాధుల బారిన పడకుండా పారిశుద్ధ్యంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ కోరారు. తణుకు మున్సిపల్ కార్యాలయం వద్ద మున్సిపాలిటీ పారిశుద్ధ్య, సచివాలయ కార్యదర్శులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడారు.

ఉచిత ఇసుక విధానాన్ని సక్రమంగా అమలు చేయాలని డిమాండ్


ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

పెంటపాడు, న్యూస్‌టుడే : ఉచిత ఇసుక విధానాన్ని సక్రమంగా అమలు చేసి భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలని సీఐటీయూ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం పెంటపాడులోని తహసీల్దార్ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో భవన నిర్మాణ రంగ కార్మికులు ధర్నా నిర్వహించి తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతి పత్రం అందజేశారు. సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ కొద్దిరోజులుగా ఇసుక దొరకకపోవడంతో పనులు లేక భవన నిర్మాణరంగ కార్మికులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో దూలం ప్రసాద్, సిరపరపు రంగారావు, పుల్లా రెడ్డి, పెనగంటి దుర్గ పాల్గొన్నారు.


అన్నదానం చేస్తున్న రాజేశ్

ఘనంగా ప్రభాస్ జన్మదిన వేడుకలు

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: తాడేపల్లిగూడెంలో ప్రభాస్ ఫ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రభాస్ జన్మదిన వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా బొలిశెట్టి రాజేశ్ పాల్గొని కేకు కోశారు. అనంతరం వృద్ధులకు అన్నదానం, ప్రాంతీయ ఆసుపత్రికి గాలి పంకాలు బహూకరించారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు నీలపాల దినేశ్, గుత్తుల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

క్లాప్ డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలని వినతి

తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే: మున్సిపల్ క్లాప్ డ్రైవర్ల సమస్యలను కూటమి ప్రభుత్వం పెద్ద మనసుతో పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పీవీ ప్రతాప్ విజ్ఞప్తి చేశారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి కమిషనర్‌కు టి రామ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను గుర్తుపెట్టుకుని క్లాప్ డ్రైవర్లకు ఉద్యోగ భద్రత కల్పించి, జీవో 36 ప్రకారం రూ.24,500 వేతనం ఇవ్వాలన్నారు. పెండింగ్‌లో ఉన్న వేతనాలు, పీఎఫ్ సొమ్ములు జమచేయాలని కోరారు.


కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న చిత్రం

మెటల్ రోడ్డుకు శంకుస్థాపన


పాల్గొన్న తెదేపా మండల అధ్యక్షుడు పరిమి రవికుమార్ తదితరులు

చినతాడేపల్లి (తాడేపల్లిగూడెం వన్‌టౌన్), న్యూస్‌టుడే: తాడేపల్లిగూడెం మండలం చినతాడేపల్లి నుంచి ఎస్సీ శ్మశాన వాటికకు వెళ్లే రహదారి దీర్ఘకాలంగా అధ్వానంగా ఉండటంతో గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ క్రమంలో తెదేపా మండల అధ్యక్షుడు పరిమి రవికుమార్ చొరవతో బుధవారం రూ.5 లక్షలతో మెటల్ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో గ్రామస్థులు, ఎన్‌డీఏ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పేదల వైద్యుడు తేతలి మృతికి సంతాపం


తేతలి వెంకటేశ్వరరావు (పాత చిత్రం)

రాజమహేంద్రవరం వైద్యం, న్యూస్‌టుడే: పేదల వైద్యుడిగా పేరొందిన తేతలి వెంకటేశ్వరరావు(79) మృతికి పలువురు సంతాపం తెలిపారు. కొంతకాలంగా ఉదర సంబంధిత ఇబ్బందితో బాధపడుతున్న ఆయన రాజమహేంద్రవరంలోని దానవాయిపేటలో బుధవారం తెల్లవారుజామున కన్నుమూశారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో జన్మించిన ఆయన కర్నూలు వైద్య కళాశాలలో ఉన్నత విద్య అభ్యసించారు. ఆంధ్రప్రదేశ్ వైద్య విధాన పరిషత్తులో సివిల్ సర్జన్‌గా సేవలు ప్రారంభించి తణుకు, కొయ్యలగూడెం, కాకినాడ ఆసుపత్రుల్లో వైద్యుడిగా పని చేసి పేదలకు సేవలు అందించారు. కాకినాడలోని రంగరాయ వైద్య కళాశాలలో ప్రొఫెసర్‌గా పని చేసి అనేక మంది వైద్యులను తీర్చిదిద్దారు. గోదావరి జిల్లాల్లో పేరెన్నికగన్న చాలామంది వైద్యులు డాక్టర్ తేతలి శిష్యులే. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. గురువారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

రాపాక, సూరంపూడిలో గ్రామసభలు


సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ దశిక వంశీ

తణుకు గ్రామీణం, అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే: రీసర్వే ద్వారా తలెత్తిన భూ సమస్యలను గ్రామసభల ద్వారా పరిష్కరించుకోవాలని తహసీల్దార్ సుందరరాజు పేర్కొన్నారు. ఇరగవరం మండలం రాపాక, సూరంపూడి గ్రామాల్లో బుధవారం రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా భూ యజమానుల నుంచి వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారి పోతురాజు, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు. ★ పాలూరు, కొమ్మర గ్రామాల్లో అత్తిలి మండల తహసీల్దార్ దశిక వంశీ ఆధ్వర్యంలో గ్రామ సభలు నిర్వహించి దరఖాస్తులు స్వీకరించారు. కొమ్మరలో 54, పాలూరులో 13 దరఖాస్తులు అందాయని తెలిపారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణపై మండల అధికారులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శామ్యూల్, ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు, పోలీసు సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ధాన్యం ఆరబెట్టి మద్దతు ధర పొందాలి


మాట్లాడుతున్న వ్యవసాయ అధికారి ప్రసాద్

మోదుగగుంట(తాడేపల్లిగూడెం వన్‌టౌన్), న్యూస్‌టుడే: మండలంలోని రైతులందరూ ధాన్యాన్ని ఆరబెట్టి మద్దతు ధర పొందాలని మండల వ్యసాయ అధికారి ఆర్ ప్రసాద్ సూచించారు. ఆయన బుధవారం మోదుగగుంట, దండగర్ర గ్రామాల్లో నిర్వహించిన పొలంపిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. రాబోయే దాళ్వాలో రైతులు 1121 విత్తన రకాన్ని సాగుకు ఎంచుకుంటే మేలు అని తెలిపారు. రైతులకు అవసరమైన విత్తనాలను రైతు సేవాకేంద్రాల ద్వారా అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఉద్యాన అధికారి శ్రీలక్ష్మి, సర్పంచి పిల్లా రాంబాబు, ప్రకృతి వ్యవసాయ సమన్వయకర్త భార్గవి దేవి, పశుసంవర్ధక శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక


విద్యార్థి వెంకటేష్‌తో వ్యాయామ ఉపాధ్యాయుడు చంద్రశేఖర్

దండగర్ర(తాడేపల్లిగూడెం వన్‌టౌన్), న్యూస్‌టుడే: ఏలూరు ఇండోర్ స్టేడియంలో బుధవారం నిర్వహించిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కబడ్డీ జిల్లా స్థాయి పోటీల్లో తాడేపల్లిగూడెం మండలం దండగర్ర జిల్లా పరిషత్తు ఉన్నతపాఠశాల విద్యార్థి ఊబా వెంకటేష్ అండర్-17 విభాగంలో ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడని ప్రధానోపాధ్యాయుడు సీహెచ్ చంద్రశేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా వెంకటేష్, వ్యాయామ ఉపాధ్యాయుడు బడుగు చంద్రశేఖర్‌లను సర్పంచి పిల్లా రాంబాబు, ఉపాధ్యాయులు అభినందించారు.

నేడు యర్రమిల్లిపాడులో వైద్య శిబిరం

ఉంగుటూరు, న్యూస్‌టుడే: పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా యర్రమిల్లిపాడు ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించనున్నారు. ఉంగుటూరు పీఎంపీ సంఘం, యర్రమిల్లిపాడు పంచాయతీ సంయుక్త ఆధ్వర్యాన శిబిరం ఉంటుందని ఆ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కొచ్చెర్లకోట శ్రీనివాస్, బీఎస్‌బీ రాజు తెలిపారు. గుండె, కంటి, కీళ్లు, నరాల సమస్యలకు వైద్యులు పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేస్తారని వారు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

బాలిక అదృశ్యం

అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే: 14 ఏళ్ల బాలిక అదృశ్యమైన ఘటన బుధవారం అత్తిలి మండలంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. మండలానికి చెందిన ఓ గ్రామంలో తొమ్మిదో తరగతి చదువుతున్న బాలిక బుధవారం ఉదయం 9 గంటలకు పాఠశాలకు వెళ్తున్నానని చెప్పి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు పాఠశాలకు వెళ్లి ఆరా తీయగా ఈ రోజు రాలేదని ఉపాధ్యాయులు చెప్పారు. చుట్టుపక్కల ప్రాంతాల్లో, బంధువుల ఇంటి వద్ద వెతకగా ఆచూకీ దొరకలేదు. తల్లి తులసి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రేమరాజు చెప్పారు.

సత్య ఎలక్ట్రికల్స్ షోరూం ప్రారంభం


షోరూం ప్రారంభిస్తున్న నిర్వాహకులు

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: తాడేపల్లిగూడెం కేఎన్ రోడ్డులో సత్య ఎలక్ట్రికల్స్ షోరూం ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి నూతన షోరూం ప్రారంభించారు. గృహ అవసరాలకు కావాల్సిన టీవీలు, వాషింగ్ మిషన్లు, ఏసీలు ఇతర ఉపకరణాలు అన్ని తక్కువ ధరకు ఇక్కడ లభిస్తాయని నిర్వాహకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

సీల్డ్ టెండర్ కమ్ బహిరంగ వేలం ప్రకటన

పశ్చిమగోదావరి జిల్లా, పెంటపాడు మండలం, ముదునూరు గ్రామ పంచాయతీకి చెందిన శిథిలావస్థలో ఉన్న పాత గ్రంథాలయ భవనం పూర్తిగా తొలగించుకుని స్టీలు, కలప... వగైరా తీసుకునేలా బహిరంగ వేలం ది. 7-11-2024న మ॥ 3 గం॥లకు గ్రామ పంచాయతీ ముదునూరు నందు నిర్వహించబడును. ఆసక్తి ఉన్నవారు పాల్గొనగలరు.
వేలం ధరావతు: రూ. 50,000/- టెండర్ దరఖాస్తు: రూ. 500/-
Note: బహిరంగ వేలం నియమనిబంధనలు, టెండర్ వివరాలకు ఉదయం 10-30 to సా॥ 5-00 సమయంలో ఆఫీసులో సంప్రదించగలరు.
తేది: 24-10-2024 సం/- పంచాయతీ కార్యదర్శి, ముదునూరు

మణిపాల్ క్లినిక్
మణిపాల్ హాస్పిటల్ విజయవాడకు చెందిన
ప్రముఖ గుండె సంబంధిత వైద్య నిపుణులు
డా॥ డి.సమరసింహా రెడ్డి
MBBS,DNB, DM (Cardiology)
ప్రతి శుక్రవారం తణుకులో ఉ॥ 10.30ని॥ల-మ॥ 2.00గం॥ల | ప్రతి శుక్రవారం తాడేపల్లిగూడెంలో మ॥ 3.00గం॥ల- సా॥ 5.00గం॥ల
వరకు అందుబాటులో ఉంటారు.
ప్రముఖ మెదడు & వెన్నుముక సంబంధిత వైద్య నిపుణులు
డా॥ వి.రవికాంత్ ఉప్పు
MS,MCh (Neuro Surgeon)
ప్రతి నెల 1వ & 3వ శుక్రవారం అందుబాటులో ఉంటారు.
తణుకులో - ఉ॥ 10.30ని॥ల-మ॥ 2.00గం॥ల వరకు
తాడేపల్లిగూడెంలో - మ॥ 3.00గం॥ల- సా॥ 5.30ని॥ల వరకు
శ్రీ కృష్ణ హాస్పిటల్ టౌన్‌హాల్ వీధి చివర, Opp. డా॥ పి.వి.రెడ్డి గారి హాస్పిటల్, **తణుకు.**
శ్రీ సాహితి కృష్ణ హాస్పిటల్ న్యూ ఫ్లై ఓవర్ బ్రిడ్జ్ రోడ్, పాత గొగులమ్మ గుడి రోడ్, కడకట్ల ఏరియా, **తాడేపల్లిగూడెం.**
✆ 92999 97727, 92810 89192
మణిపాల్ హాస్పిటల్ విజయవాడ
వారధి దగ్గర, తాడేపల్లి - 522 501
ఫోన్: 08645 669966
https://www.manipalhospitals.com/vijayawada/
manipalhospitals LIFE'S ON

వణికిస్తున్న వారధులు
ఏళ్లు గడుస్తున్నా అభివృద్ధికి నోచుకోని వైనం

తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే: తణుకు నియోజకవర్గంలోని ప్రధాన ర.భ. శాఖ రహదారుల్లో పలు కీలమైన పంట కాలువలు, మడుగులు, మురుగు బోదెలపై నిర్మించిన వంతెనలు శిథిలావస్థకు చేరాయి. వీటిని నిర్మించి సుమారు 50 సంవత్సరాలకు పైగా గడుస్తోంది. పలు వంతెనల కింద భాగం ఇనుప చువ్వలు తుప్పు పట్టి బయటికి రావడంతో పాటు రెయిలింగ్‌లు శిథిలమయ్యాయి. వీటిపై నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఇంతటి ప్రాధాన్యత ఉన్న ఈ వంతెనల నిర్వహణ అధికారులు గాలికొదిలేయడంతో వాహనదారులు ఏ సమయంలో ఏ ప్రమాదం సంభవిస్తుందోనని ఆందోళన చెందుతున్నారు. కూటమి ప్రభుత్వం వీటిపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.



ఇరగవరం నుంచి రాపాక, ఓగిడి, అయితంపూడి, పెరవలి పెనుగొండ తదితర గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారిలో ఇరగవరం వద్ద మడుగుపై ఉన్న వంతెన ఇది. ప్రస్తుతం రెయిలింగ్ శిథిలమై ఊచలు పైకి కనబడుతూ ప్రమాదకరంగా మారింది. ఈ విషయమై ర.భ శాఖ జేఈ యశ్వంత్ మాట్లాడుతూ రెయిలింగ్ మరమ్మతుల నిమిత్తం రూ.3 లక్షల అంచనాతో ప్రతిపాదనలు పంపించామన్నారు.



రేలంగి నుంచి అదే గ్రామంలో రైల్వేస్టేషన్, గుమ్మంపాడు తదితర గ్రామాలకు వెళ్లే ర.భ శాఖ రహదారిలో రేలంగి వద్ద గోస్తనిపై ఉన్న వంతెన ఇది. రెయిలింగ్ పూర్తిగా శిథిలమై సంవత్సరాలు గడుస్తున్నా అధికారులు పట్టించుకోవడంలేదని స్థానికులు, వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ర.భ శాఖ ఏఈ రవిబాబు మాట్లాడుతూ మరమ్మతులకు ప్రతిపాదనలు పంపించామన్నారు.



వీరభద్రపురం నుంచి తణుకు, కొమరవరం వెళ్లే ర.భ శాఖ రహదారిలో వీరభద్రపురం వద్ద గోస్తని కాలువపై ఉన్న వంతెన నిర్మించి సుమారు 30 సంవత్సరాలు అవుతోంది. కొద్ది సంవత్సరాల కిందట ర.భ శాఖ అధికారులు బ్రిడ్జి బలహీనంగా ఉందని, 15 టన్నుల బరువు మించి వాహనాలు వెళ్లడం నిషేధించామని హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. కానీ లోడు వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. ఈ విషయమై ర.భ శాఖ ఏఈ యశ్వంత్ మాట్లాడుతూ నూతన వంతెన నిర్మాణానికి రూ.5 కోట్లతో ప్రతిపాదనలు పంపించామన్నారు.



తణుకు మండలం కోనాల గ్రామం నుంచి తాడేపల్లిగూడెం వెళ్లే ప్రధాన రహదారిలో కోనాల వద్ద ఈ వంతెన 1950లో నిర్మించారు. దీని కింది భాగంలో సిమెంటు పెచ్చులు ఊడి, ఇనుప చువ్వలు తుప్పు పట్టి బయటకు వచ్చాయి. వంతెన ఇరుకుగా ఉండటంతో వాహనదారులు నిత్యం భయపడుతూనే రాకపోకపోకలు సాగిస్తున్నారు. వంతెన పరిధి తణుకు పరిధిలో, రహదారి మాత్రం తాడేపల్లిగూడెం ర.భ శాఖ పరిధిలో ఉండటంతో ప్రజాప్రతినిధులు, అధికారులు ఎవరూ కన్నెత్తి చూడకపోవడంతో అభివృద్ధికి నోచుకోక ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. ఈ విషయమై తాడేపల్లిగూడె ర.భ శాఖ ఏఈ రవిబాబు మాట్లాడూతు నూతన వంతెన నిర్మాణం చేపట్టేందుకు ప్రతిపాదనలు పంపిచామన్నారు.

(c) eenadu